ఆదివారం
22-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 210
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

దేశానికి కొత్త దిశ ఇవ్వగలను

అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించే అర్హత తనకున్నదని, సమర్థ నాయకత్వం అందించగలనని, దేశాన్ని కొత్త దిశలో ముందుకు నడిపించగలనని ఇండో-అమెరికన్ రిపబ్లిక్ నేత నిక్కీ హేల్ అన్నారు.

2లో

ఎమ్మెల్సీ పదవుల జాతర

- మేలోగా 21 స్థానాలు ఖాళీ
- మొత్తం దక్కించుకునేందుకు సీఎం కసరత్తు
- అభ్యర్థిత్వాల వేటలో వైసీపీ నేతలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రానున్న మూడు నెలల్లో శాసనమండలిలో పెద్దసంఖ్యలో ఎమ్మెల్సీ పోస్టులు ఖాళీ కానుండడంతో అధికారపార్టీలో హడావుడి ప్రారంభమైంది. ఎమ్మెల్యే కోటాతోపాటు స్థానిక సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయ కోటాల్లో మే 1వ తేదీ లోపు దాదాపు 21 స్థానాలు ఖాళీ కానున్నాయి. ఈ మొత్తం దక్కించుకోవడానికి వైసీపీ ఈసారి గట్టి కసరత్తు చేస్తోంది. గతంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలను అధికారపార్టీలు పెద్దగా పట్టించుకునేవి కావు. ఎమ్మెల్యే, స్థానిక సంస్థల కోటాలో అధికారపార్టీకి ఎక్కువ అవకాశాలుంటాయి. కానీ ఈసారి శాసనమండలిలో ఖాళీ అయ్యే ఏ ఒక్క స్థానాన్నీ వదులుకోకూడదన్న భావనతో వైసీపీ అధిష్ఠానం ఉంది. ఖాళీ అయ్యే స్థానాలకు సంబంధించి అధికార పార్టీలో నేతలు ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు. శాసనసభ్యుల కోటాలో ఏడు స్థానాలు ఖాళీ కానున్నాయి. వీటిలో వైసీపీకి చెందిన వారు ఐదుగురు ఉండగా, టీడీపీకి చెందిన నారా లోకేశ్, బచ్చుల అర్జునుడు పదవీకాలం మార్చి 29వ తేదీతో ముగియనుంది. ఈ రెండు స్థానాలు ఈసారి వైసీపీ ఖాతాలో చేరనున్నాయి. ఈ ఏడు పోస్టుల కోసం వైసీపీలో గతంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ పదవులు ఆశించిన నేతలు, జిల్లాల ఇన్‌చార్జిలు తమ వంతు ప్రయత్నాలు ప్రారంభించారు. అన్ని కులాలకు ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉన్నందున, దానికనుగుణంగా నేతలు పార్టీ పెద్దల ఆశీస్సుల కోసం నానా తంటాలు పడుతున్నారు. స్థానిక సంస్థల కోటాలోనూ దాదాపు 9 స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ఇవన్నీ టీడీపీకి చెందినవి కాగా, ఈసారి అధికార పార్టీ తన ఖాతాలో వేసుకునేందుకు కసరత్తు నిర్వహిస్తోంది. స్థానిక సంస్థల్లో వైసీపీ అభ్యర్థులే పెద్దసంఖ్యలో గెలిచినందున ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు నల్లేరుపై నడకే అవుతుందన్న ధీమాతో ఆ పార్టీ నేతలున్నారు. ఈ కోటాలో అభ్యర్థిత్వాన్ని దక్కించుకునేందుకు వైసీపీలో నేతలు పోటీపడుతున్నారు. టీడీపీలో ఎమ్మెల్సీ పదవులు పొంది గతంలో వైసీపీలోకి వెళ్లిన డొక్కా మాణిక్యవరప్రసాద్, పోతుల సునీతలను మళ్లీ కొనసాగించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సీఎం జగన్ నుంచి ఇప్పటికే హామీలు పొంది ఉన్న బొప్పన భవకుమార్, యార్లగడ్డ వెంకట్రావు, మండపేటలో పట్టాభిరామయ్య, ఇటీవల మృతి చెందిన ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి సతీమణి శ్రీలక్ష్మి, పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త రావి రామనాథబాబు, మర్రి రాజశేఖర్, మేకా శేషుబాబు, జంకె వెంకటరెడ్డి, నర్తు రామారావు, దుట్టా రామచంద్రరావు తదితరులు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

ఇక పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న యండపల్లి శ్రీనివాసులు రెడ్డి, కడప-అనంతపురం-చిత్తూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వెన్నపూస గోపాలరెడ్డి, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి చెందిన పీవీఎన్ మాధవ్, కడప-అనంతపురం-కర్నూలు ఉపాధ్యాయ నియోజకవర్గానికి చెందిన కత్తి నర్సింహారెడ్డి, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గానికి చెందిన విటపు బాలసుబ్రహ్మణ్యం పదవీకాలం మార్చి 29వ తేదీతో ముగియనుంది. దీంతో ఈసారి ఈ నియోజకవర్గాలకు అధికారపార్టీ నుంచి పోటీ పడేందుకు చాలామంది సిద్ధమవుతున్నారు. ఇలా మొత్తానికి మేలోపు పెద్దసంఖ్యలో ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానుండడంతో ముఖ్యంగా మంత్రులు తమ మద్దతుదారులకు అభ్యర్థిత్వాలు దక్కించుకునేందుకు అన్ని కోణాల్లో ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రం జిల్లాల వారీగా తాను హామీలిచ్చి ఇప్పటివరకు పదవులు ఇవ్వలేని వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగిస్తూ, మరోవైపు రాబోయే ఎన్నికలకు పార్టీకి ఉపయోగపడేలా ఆయా సామాజికవర్గాల్లో సమర్థులైన వారిని ఎంపిక చేసే కసరత్తు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

ఆహార భద్రత కరువు

- పేదలకు అందని రేషన్ కార్డులు
- లభించని ఆహార ధాన్యాలు-తప్పని పస్తులు
- ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ పరిధి పెంపుపై సర్కార్ నిర్లక్ష్యం
- జనగణనను పట్టించుకోని వైనం

న్యూఢిల్లీ: దేశంలో ఆహార భద్రత లోపించింది. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ ద్వారా రేషన్ అందడం లేదు. రేషన్ కార్డులు లేక ఆహార ధాన్యాలను ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పొందలేక పేదలు ముఖ్యంగా వలస కార్మిక కుటుంబాలు పస్తులుండాల్సి వస్తుండటం బాధాకరం. ప్రభుత్వం జనగణనను పరిగణించకుండా 2011 నాటి జనాభా లెక్కల ప్రాతిపదికన రేషన్ కార్డులు జారీ చేయడంతో కోట్లాది మంది సబ్సిడీ ధరలకు రేషన్‌కు దూరమయ్యారు. ఈ పరిస్థితుల్లో రేషన్ కార్డులు అందని ద్రాక్షలా మారాయి. పెద్ద సంఖ్యాక జనాభా ఆహార హక్కుకు నోచుకోవడం లేదు. ఆర్థిక స్థితిని సూచిస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థ కింద సబ్సిడీకి ఆహార ధాన్యాలను పొందేందుకు వీలు కల్పించే అధికార పత్రమే రేషన్ కార్డు. దీని కోసం దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నా... చెప్పులరిగేలా అధికారుల చుట్టూ ప్రదిక్షణలు చేసినా ఫలితం ఉండటం లేదు.

దక్షిణ ఢిల్లీలోని మురికివాడలే కాకుండా దేశవ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను రేషన్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఓ వైపు దిరిగిరాని ధరలు... సబ్సిడీ రేట్లకు ప్రభుత్వం ద్వారా రేషన్ లభించక పేదలు ఇబ్బంది పడుతున్నారు. రెండు పూట్ల భోజనం చేసే పరిస్థితులు లేక ఓ పూట తిని మరో పూట పస్తులు ఉంటున్నారు. కోవిడ్ వల్ల వారి కష్టాలు వర్ణణాతీతమయ్యాయి. ఉపాధి -ఆదాయం లేక కుటుంబ పోషణ భారమై దినదిన గండంగా బతుకు ఈడ్చారు. కార్డులు లేక ప్రభుత్వమిచ్చే రేషన్ పొందలేక వలస కార్మిక కుటుంబాలు దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టినా స్పందన కరవవుతోందని కార్మికులు వాపోయారు.

దేశ రాజధాని ఢిల్లీలోనే 2022 మార్చి వరకు 2,93,185 రేషన్‌కార్డుల అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు ఆర్టీఐ అభ్యర్థనకు వచ్చిన సమాధానం ప్రకారం ఆహార హక్కు ఉద్యమ కార్యకర్త అంజలీ భరద్వాజ్ వెల్లడించారు. జనాభా లెక్కలను ప్రభుత్వం పరిగణించి ఉంటే నేడు కోట్లాది మంది ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ పరిధిలోకి వచ్చేవారని, ఆహార ధాన్యాలను ప్రతినెలా పొందే వారని ఆహార హక్కు ఉద్యమ కార్యకర్త అమృతా జోహ్రీ అన్నారు. పౌరులకు ఆహార భద్రత కల్పనకు ప్రత్యామ్నాయాలను అన్వేషించకపోవడానికి కారణాలు ఏమిటని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో 28 కోట్ల మందికిపైగా అసంఘటిత రంగాల కార్మికులు నమోదై ఉంటే వారందరికీ రేషన్ కార్డులు లేవని గుర్తుచేశారు. ఎవరికి కార్డులు ఉన్నాయి... ఎవరికి లేవన్నది ఆరా తీసి తగు సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. జనగణనను నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైనందున ప్రజలకు రేషన్ లభించడం లేదని, ఇది అమానవీయమని ఆమె నొక్కిచెప్పారు.

ఇదిలావుంటే, దేశంలోని ఆహార అభద్రతా సమస్యను పరిష్కరించాలని 2013లో జాతీయ

- మిగతా 2 లో

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌పై మళ్లీ రాళ్లదాడి

కతిహార్(బీహార్): వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్ల దాడి ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా బీహార్‌లోని కతిహార్ జిల్లాలో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లదాడికి పాల్పడ్డారు. దీంతో రైలు అద్దం పగిలింది. ప్రయాణికులు ఎవరికీ గాయాలు కాలేదు. న్యూజల్పాయ్‌గురి నుంచి శుక్రవారం సాయంత్రం 3 గంటలకు వందే భారత్ రైలు ప్రారంభమైంది. సాయంత్రం 4.25 గంటల సమయంలో బీహార్‌లోని దకోలా-టెల్టా స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సీ6 కోచ్‌లో ఓ అద్దం పగిలింది. ప్రయాణికు లెవరికీ గాయాలు కాలేదేని రైల్వే అధికారులు తెలిపారు. దకోలా రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని రైల్వే శాఖకు చెందిన ఓ అధికారి పేర్కొన్నారు. డిసెంబర్ 30న ఈ రైలు ప్రారంభం కాగా.. రెండ్రోజులకే వరుసగా రెండు వరుస రాళ్ల దాడి ఘటనలు జరిగాయి. తాజాగా ఇది మూడోది. ఇటీవల సికింద్రాబాద్-విశాఖ వందే భారత్ రైలుపై ప్రారంభానికి ముందే విశాఖలో కూడా ఆకతాయిలు రాళ్లు రువ్వారు.

పోలీసు ఉద్యోగాలకు డాక్టరేట్లు, ఎంటెక్ గ్రాడ్యుయేట్లు

నేడు రాత పరీక్ష



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు ఆదివారం రాతపరీక్ష జరుగుతుంది. ఇందుకుగాను ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆశ్చర్యమేమంటే పోలీసు కానిస్టేబుల్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో 10 మంది పీహెచ్‌డీ పొందిన వారు, 930మంది ఎంటెక్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. కానిస్టేబుల్ పోస్టుకు ఇంటర్మీడియట్‌ను విద్యార్హతగా రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్ణయించింది. అభ్యర్థుల జాబితాలో 5,284 మంది ఎంబీఏ, 4,365 మంది ఎంఎస్‌సీ, 94 మంది ఎల్‌ఎల్‌బీ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. మొత్తంగా 13,961 మంది పోస్టు గ్రాడ్యుయేట్లు, 1,55,537 మంది అండర్ గ్రాడ్యుయేట్లు పోలీసు పరీక్షకు హాజరవుతున్నారు. మొత్తం 6,400 పోస్టులకుగాను 5,03,486మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 5,03,486 మంది అభ్యర్థులకుగాను 3,95,415 మంది పురుషులు, 1,08,071 మంది మహిళలు పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు చేశారు.

55 బీసీ కార్పొరేషన్ల పదవీ కాలం పెంపు

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేసిన చైర్మన్లు, డైరెక్టర్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో మొత్తం 55 బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవీకాలాన్ని మరో రెండేళ్లపాటు పొడిగిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెనుకబడిన వర్గాల్లోని అన్ని కులాలకు ప్రాధాన్యతనిస్తూ వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఒకేసారి 55 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. ప్రతి కార్పొరేషకు ఒక చైర్మన్‌తో పాటు 11 మంది డైరెక్టర్లని నియమించారు. వీరి పదవీ కాలం రెండు సంవత్సరాలుగా నిర్ణయిస్తూ గతంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరి పదవీకాలం ముగిసినా వీరికి ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు కాలేదు. నిధులు, విధులు కూడా ఏమీ లేవు. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. అయినప్పటికీ ఎన్నికలు సమీపిస్తుండడంతో వీరి పదవీకాలాన్ని మరో రెండు పొడిగిస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ఉత్తర్వులు జారీ కావడంతో కార్పొరేషన్ల చైర్మన్లు. డెరెక్టర్లు హర్షాన్ని వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనేక ప్రాంతాల్లో చైర్మన్లు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

న్యూజిలాండ్ కొత్త ప్రధానిగా క్రిస్ హిప్‌కిన్స్?

2లో

ఇదీ లోకం!

మా సారు, మా ప్రభుత్వం చేసిన గొప్పలు చెబుతారు వీళ్లందరినీ పనిపాటా మాన్పించి కూచోబెట్టాం!

టిడ్కో, జగనన్న కాలనీ లబ్ధిదారుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు

పోరు ఆగదు

- టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి
- జగనన్న కాలనీలకు మౌలిక వసతులు కల్పించాలి
- ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి
- జగన్ పేదలకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- ఐదో రోజు పోరుబాటలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో జగనన్న కాలనీ లబ్ధిదారుల సమస్యలు పరిష్కారమయ్యేవరకు తమ పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ పోరుబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఏలూరు జిల్లా రూరల్ మండలం పోణంగిలో టిడ్కో గృహాలను సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి

- మిగతా 2 లో

భ్రష్టుపట్టిన జుమ్లా పార్టీ

కాంగ్రెస్ విమర్శ: మోదీ ప్రభుత్వంపై ఛార్జిషీటు విడుదల

26 నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర-లోగో ఆవిష్కరణ

న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరించే ప్రజావ్యతిరేక విధానాల కారణంగా దేశపౌరుల వెతలు వర్ణనాతీతమయ్యాయని కాంగ్రెస్ విమర్శించింది. బీజేపీని 'భ్రష్టుపట్టిన జుమ్లా పార్టీ'గా వర్ణించింది. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఛార్జిషీటును విడుదల చేసింది. 'కొందరి కోసం.. కొందరి వికాసం కోసం... అందరితో నమ్మకద్రోహం' నినాదంతో బీజేపీ పనిచేస్తోందని దుయ్యబట్టింది. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నట్లు తమ ఛార్జిషీటులో కాంగ్రెస్ పేర్కొంది. 'మేం జాతీయ స్థాయిలో ఛార్జిషీటును విడుదల చేశాం. రాష్ట్రాలవారీగా ఛార్జిషీట్లను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు రూపొందిస్తాయి' అని శనివారం ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్ తెలిపారు. 'హాత్ సే హాత్ జోడో అభియాన్' లోగోను ఆవిష్కరించారు. ఈనెల 26వ తేదీ నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ క్రమంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రజలకు

- మిగతా 2 లో

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

త్రిపురలో లెఫ్ట్ - కాంగ్రెస్ బృందానికి ఈసీ హామీ

త్రిపురలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని సీపీఎం-కాంగ్రెస్ ప్రతినిధి బృందానికి ఎన్నికల సంఘం శనివారం హామీ ఇచ్చింది.

2లో

న్యూజిలాండ్ కొత్త ప్రధానిగా క్రిస్ హిప్‌కిన్స్?

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ కొత్త ప్రధానమంత్రిగా క్రిస్ హిప్‌కిన్స్ ఎన్నిక దాదాపు ఖరారైంది. ప్రస్తుత ప్రధాని జెసిండా ఆర్డెన్స్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో అధికార లేబర్ పార్టీ నాయకుడిని ఎన్నుకునే ప్రక్రియ ప్రారంభమైంది. పార్టీకి చెందిన ఎంపీ, మాజీ మంత్రి హిప్‌కిన్స్ నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 22న జరుగనున్న సమావేశంలో పార్టీ ఎంపీలు ఆయన నామినేషన్‌కు మద్దతు తెలపాల్సి ఉంది. ఒకే నామినేషన్ రావడంతో తదుపరి ప్రధానిగా హిప్‌కిన్స్ (44) ఎన్నిక ఖరారైనట్లు లేబర్ పార్టీ ప్రకటించింది. దీంతో దేశ 41వ ప్రధానిగా హిప్‌కిన్స్ త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారని తెలుస్తోంది. అక్టోబర్ 14న సార్వత్రిక ఎన్నికలు ఆయన సారథ్యంలో జరుగుతాయి. కోవిడ్ వేళ హిప్‌కిన్స్ కోవిడ్ రెస్పాన్స్ మినిస్టర్‌గా సమర్థవంతంగా వ్యవహరించారు. ఆయన నాయకత్వంలో మహమ్మారిని న్యూజిలాండ్ కట్టడి చేయగలిగింది. హిప్‌కిన్స్ తొలుత 2008లో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. 2020 నవంబరులో కోవిడ్ కట్టడికిగాను మంత్రిగా నియమితులయ్యారు. జసిండా అర్డెన్ తన రాజీనామాను అధికారికంగా గవర్నర్ జనరల్‌కు అందజేసిన తర్వాత కింగ్ చార్లెస్ 3 తరపున హిప్‌కిన్స్‌ను ఆయన ప్రధానిగా నియమిస్తారు.

దేశానికి కొత్త దిశ ఇవ్వగలను...

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపై నిక్కీ హేలే ఆసక్తి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిష్టించే అర్హత తనకున్నదని, సమర్థ నాయకత్వం అందించగలనని, దేశాన్ని కొత్త దిశలో ముందుకు నడిపించగలనని ఇండో-అమెరికన్ రిపబ్లిక్ నేత నిక్కీ హేల్ అన్నారు. ఆమె ఇటీవల ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అగ్రరాజ్యానికి కొత్త దిశ ఇవ్వగలనని చెప్పారు. ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్ మరో అవకాశం ఇవ్వకూడదన్నారు. అవకాశమొస్తే అధ్యక్ష రేసులో నిలుస్తానని చెప్పారు. అందుకోసం తాను కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే పోటీపై ఇప్పుడే ఎలాంటి ప్రకటన చేయనన్నారు. నిక్కీ (51) ఐరాసకు అమెరికా దౌత్యాధికారి, దక్షిణ కరోలినా మాజీ గవర్నర్. భారత సంతతి అమెరికన్, రిపబ్లికన్ పార్టీ నాయకురాలు. అధ్యక్ష పీఠాన్ని అధీష్టించే ముందు ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త నాయకత్వాన్ని చేపట్టగలమా? కొత్త దశలో పయనం సాగించే సామర్థ్యం ఉన్నదా? అని ఆత్మవిమర్శ చేసుకోవాల్సి ఉంటుందని, అవుననే సమాధానం వస్తే అందుకోసం సంసిద్ధం కావడంతో తప్పు లేదని ఆమె అన్నారు. తనపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, సమర్థ నాయకురాలిగా దేశానికి కొత్త దిశ ఇవ్వగలనని దీమాగా చెప్పారు. గవర్నర్‌గా, దౌత్యాధికారిగా సమర్థ సేవలు అందించానన్నారు. రెండెంకల నిరుద్యోగంతో ఇబ్బంది పడుతున్న రాష్ట్రానికి గవర్నర్ అయి ఆ సమస్య పరిష్కారానికి కృషిచేశా... దౌత్యాధికారిగా ప్రపంచానికి సమర్థ సేవలు అందించా. నన్ను అగౌరవించినప్పుడు కూడా నా సామర్థ్యాన్ని నిరూపించుకున్నా. నేను ఏ రేసులోనూ ఓడిపోలేదు.. ఇప్పుడు కూడా అదే చెబుతాను.. అధ్యక్షురాలిగా రాణించగలననే చెప్పగలను' అని నిక్కీ అన్నారు. బైడెన్‌కు మరోసారి అధ్యక్షత కట్టబెట్టరాదని ఆమె నొక్కిచెప్పారు. 'నేను పోటీ చేస్తే... అది బైడెన్‌తోనే... అన్ని అంశాలపై దృష్టిని కేంద్రీకరించా. బైడెన్‌కు మరో పదవీకాలాన్ని ఇవ్వలేం' అని నిక్కీహేలే అన్నారు. కాగా, అమెరికా అధ్యక్ష ఎన్నికలు 2024, నవంబరు 5న జరగనున్నాయి.

బడుగుల అభివృద్ధికి కృషి చేసిన చెంచయ్య

గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడిన వ్యక్తి కమ్యూనిస్టు పార్టీ నాయకులు రావులపల్లి చెంచయ్య అని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం రావులపల్లి చెంచయ్య 16వ వర్ధంతి సభ జరిగింది. సీపీఐ నియోజకవర్గ నాయకులు అందె నాసరయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో తొలుత రావులపల్లి చెంచయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు నాయకులు పూల సుబ్బయ్య, మర్రి సుబ్బరాయుడు, రావులపల్లి చెంచయ్య కుటుంబాలతో ఉన్న అనుబంధానికి తాను గర్విస్తున్నానని తెలిపారు. వీరి దగ్గర గమనించి నేర్చుకున్న సిద్ధాంతాలను తాము అవలంబిస్తున్నందుకు గర్వంగా ఉందని, ఇప్పటి తరాల వారికి చెంచయ్య లాంటి వ్యక్తులు మార్గదర్శకులని అన్నారు. సీపీఐ నియోజకవర్గ నాయకులు అందె నాసరయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావాలు కలిగిన వ్యక్తి చెంచయ్య అని అన్నారు. మార్కాపురం ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితోనే తాము కూడా విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్‌లో చురుకుగా పాల్గొన్నామని తెలిపారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు పందీటి కాశీ రావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలతో పనిచేసే చెంచయ్య లాంటివారు మనందరికీ మార్గదర్శకులు అన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు షేక్ ఖాసిం మాట్లాడుతూ రావులపల్లి చెంచయ్య తన మరణానంతరం కూడా ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో అవయవ దానం చేసిన మహోన్నత వ్యక్తి అని, ఇది సీపీఐకే గర్వకారణం అన్నారు. ఎంపీజే జిల్లా అధ్యక్షుడు షేక్ రజాక్ మాట్లాడుతూ రావులపల్లి చెంచయ్య లాంటి గొప్ప వ్యక్తులు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, రావులపల్లి చెంచయ్య కుటుంబ సభ్యులు ప్రసాదు, ఏఐటీయూసీ నాయకులు ఎస్‌కే కాశిం, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కత్తి, పోతులను ఎమ్మెల్సీలుగా గెలిపించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజులను ఎమ్మెల్సీలుగా గెలిపించుకొని శాసనమండలికి పంపుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు జిల్లా పత్తికొండలోని స్థానిక చదువుల రామయ్య భవనంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ సంఘాలు, సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల సమావేశం ఎస్టీయూ జిల్లా కన్వీనర్ సుంకన్న అధ్యక్షతన నిర్వహించారు. నిరంతరం ప్రజా సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు నిరుద్యోగ సమస్యలపై ఉద్యమాలు చేసి, ప్రశ్నించే గొంతుకలను శాసనమండలికి పంపేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని వారు పిలుపునిచ్చారు. విజ్ఞులైన ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు డి.రాజా సాహెబ్, రంగారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు కొత్తపల్లి సత్యనారాయణ, కుంపటి నారాయణ, రామ్మోహన్ రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భాస్కర్, ప్రసాద్‌బాబు, తుగ్గలి, దేవనకొండ, మద్దికేర సీపీఐ మండల కార్యదర్శులు సుల్తాన్, నరసారావు, నాగరాజు, వామపక్ష ప్రజాసంఘాల నాయకులు నబీరసూల్, కృష్ణయ్య, కారుమంచి, దస్తగిరి, వీర శేఖర్, అల్తాఫ్, నజీర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బలరాముడు, నర్సోజి, తదితరులు పాల్గొన్నారు.

నేడు అర్జెంటైనాకు లూలా

బ్యూనోస్ ఏర్స్: బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా ఆదివారం అర్జెంటైనాలో అధికారికంగా పర్యటిస్తారు. ఆయనకు ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రి శాంటియాగో కఫీరో ఘనంగా స్వాగతం పలకనున్నారు. 22వ తేదీ రాత్రికి అర్జెంటైనా రాజధానిలోని జార్జ్ న్యూబెరీ విమానాశ్రయ-సైనిక స్థావరానికి దక్షిణ అమెరికా దిగ్గజం చేసుకుంటారని అధికారిక ప్రకటన పేర్కొంది. షెడ్యూల్ ప్రకారం సోమవారం లూలా అధికారిక పర్యటన మొదలవుతుంది. ఉదయం 10.30 గంటలకు లిబరేటర్ జనరల్ జోసే డి శాన్ మార్టిన్ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటిస్తారు. అనంతరం అర్జెంటైనా అధ్యక్షుడు అల్బెర్టో ఫెర్నాండెజ్‌తో కాసా రొసాడాలో భేటీ అవుతారు. రెండు దేశాల మధ్య కుదిరిన సహకార ఒప్పందాలపై ఆయా రంగాల మంత్రులతో కలిసి ఇద్దరు అధ్యక్షులు సంతకాలు చేస్తారు. ఆర్థిక-ఇంధన సమగ్రత, రక్షణ, ఆరోగ్యం, శాస్త్రసాంకేతికత, ఆవిష్కరణలు, అంటార్కిటికా సహకారం తదితర ఒప్పందాలపై సంతకాలు జరుగుతాయని అధికార వర్గాలు తెలిపాయి. ఆపై ఇద్దరు అధినేతలు కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహిస్తారని వెల్లడించాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఇవా పెరాన్‌లో భోజనం, అనంతరం బిజినెస్ ఫోరంలో బైసెంటెనియల్ (ద్విశతాబ్ది) మ్యూజియం ప్రారంభం, మానవహక్కుల సంఘాల నేతలతో సమావేశం జరుగుతుంది. రాత్రి 7.15 గంటలకు కిర్చనెర్ సాంస్కృతిక కేంద్రంలో అర్జెంటైనా-బ్రెజిల్ సౌభ్రాతృత్వంపై కాన్సర్ట్, ఫ్లాబోస్ ఒరిజినారియోస్-గ్యురెరోస్ డెల్ టింపో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఇద్దరు అధ్యక్షులు ప్రారంభిస్తారు. కాగా, మంగళవారం జరగబోయే లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల ఏడవ సదస్సులో లూలా డ సిల్వా పాల్గొనున్నారు.

30న జోసే మార్టి 170వ జయంత్యుత్సవం

హవానా: విప్లవవీరుడు జోసే మార్టి 170వ జయంత్యుత్సవాన్ని ఈనెల 30న క్యూబా ఘనంగా జరుపుకోనున్నది. దక్షిణ అమెరికా బ్రిగేడ్‌కు చెందిన అర్జెంటైనా, బ్రెజిల్, బొలీవియా, చిలీ, ఎల్ సాల్వడార్ దేశాల నుంచి 83 మందిసభ్యులు జోసే మార్టి జయంత్యుత్సవానికి సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. ఆయన జయంత్యుత్సవాన్ని పురస్కరిమకొని దేశంలో చరిత్రాత్మక కట్టడాల సందర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. 30వ తేదీనాటికి హవానా, మాంటజాస్, విల్లా క్లారోలోని చారిత్రక- ఆర్థిక-సాంస్కృతిక, సామాజిక ప్రయోజనాల కేంద్రాలను సందర్శిస్తారు. ఇదే క్రమంలో జాతీయ పరిణామాలపై సదస్సులు, సమావేశాలు, వేర్వేరు రంగాల ప్రతినిధులు, క్యూబా రాజకీయ-ప్రజా సంఘాల నేతలనూ కలుస్తారు. బ్రిగేడ్ సభ్యులతంతా అనంతరం హవానాలో ఈనెల 24-28 తేదీల్లో జరగబోయే ప్రపంచ సమతుల్యతపై ఐదవ అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటారు. మొత్తం 82 దేశాల నుంచి వేల మందికిపైగా ప్రతినిధులు హాజరవుతారు. మార్టి వరల్డ్ సాలిడరిటీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఐరాస విద్య-శాస్త్ర-సాంస్కృతిక సంఘాలు సహకారంలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

పొన్నూరులో...

డోన్‌లో...

పోరు ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకున్నారు. టిడ్కో లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. లబ్ధిదారులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు సీపీఐ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా ఈ ఇళ్లలో పేదలు ఎలా ఉంటారని ఎగతాళి చేసిన జగన్, కట్టిన ఇళ్లను కూడా గత మూడున్నరేళ్లుగా లబ్ధిదారులకు స్వాధీనం చేయకుండా ఇబ్బందిపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం చెప్పే విషయాలకు, ఆచరణకు ఏ మాత్రం పొంతన లేదన్నారు.

కేవలం గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు అయినందున, లబ్ధిదారులకు వాటిని స్వాధీనం చేస్తే ఆ ఘనత టీడీపీకి దక్కుతుందన్న అక్కసుతో ప్రజల జీవితాలతో జగన్ ఆడుకుంటున్నారని రామకృష్ణ మండిపడ్డారు. టిడ్కో ఇళ్లను వైసీపీ కార్యకర్తలకు ఇవ్వడానికి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఇకనైనా ఆ ప్రయత్నాలు మానుకుని మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు వాటిని స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారిపక్షాన సీపీఐ పోరాడుతుందని హెచ్చరించారు. ఇక జగనన్న కాలనీల పరిస్థితి రాష్ట్రంలో మరింత అధ్వానంగా ఉందని విమర్శించారు. జగనన్న కాలనీలలో తాగునీరు, అంతర్గత రహదారులు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. ఎన్నికల సందర్భంగా పేదవారికి సొంత ఇంటి కల సాకారం చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత దానికి భిన్నంగా ఒక సెంటు స్థలం ఊరికి దూరంగా ఇచ్చి ఇల్లు కట్టినట్లు గొప్పగా ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పట్టణంలో 2 సెంట్లు, గ్రామాలలో 3 సెంట్లు స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. టిడ్కో, జగనన్న కాలనీల్లో లబ్ధిదారులతో ఈ నెల 31వ తేదీ వరకు సంతకాల సేకరణ చేసి ఫిబ్రవరి 6న జిల్లా కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రాలు అందజేస్తామని, ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఫిబ్రవరి 22న విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ మాట్లాడుతూ జగనన్న కాలనీలలో ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి, టిడ్కో ఇళ్లను మౌలిక సదుపాయాలతో లబ్ధిదారులకు తక్షణం స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ సీపీఐ పోరాట ఫలితం కారణంగానే రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయడానికి ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి పొటేలు పెంటయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు :

జగనన్న గృహాలకు రూ.5 లక్షలు ఇచ్చి, టిడ్కో ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రమైన పొన్నూరులోని టిడ్కో ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ పేదలకు పంపిణీ చేసిన స్థలాలలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వాలని, గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టి 90 శాతం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను మిగతా 10 శాతం పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. జగనన్న ఇళ్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను వెంటనే అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్న డిమాండ్లతో కరపత్రాలు పంపిణీ చేసి లబ్ధిదారులందరితో సంతకాలు చేయించి పట్టణ కమిషనర్లకు, మండల తహశీల్దార్‌లకు అర్జీలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఆరేటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

డోన్‌లో

జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణ సమీపంలో దొరపల్లె దగ్గర సీపీఐ అధ్వర్యంలో జగనన్న కాలనీని సందర్శించి లబ్ధిదారులతో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులుతో పాటు జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, డోన్ మున్సిపాలిటీ 16 వార్డు కౌన్సిలర్ పి.సుంకయ్య, డోన్ మండల కార్యదర్శి పులి శేఖర్, డోన్ పట్టణ కార్యదర్శి నారాయణ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు కె.ప్రభాకర్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మీ దేవమ్మ, ఏఐవైఫ్ నాయకులు రణత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో

పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం మహదేవపట్నం గ్రామంలోని జగనన్న కాలనీలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు బృందం లబ్ధిదారుల సమస్యలపై సంతకాలు సేకరించింది. ఈ కార్యక్రమంలో భీమారావుతోపాటు సీపీఐ ఉండి మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. తణుకు పైడిపర్రు రోడ్డులోని జగనన్న లేఔట్‌లోని గృహ నిర్మాణాలను, మౌలిక వసతులను సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, కోశాధికారి గుబ్బల వెంకటేశ్వరరావు, బొద్దాని మురళీ, బండి సత్యనారాయణ తదితరులు పరిశీలించారు. రావిపాడు గ్రామంలో బెండ్ల పాలెం జగనన్న కాలనీలో బోడ బల్ల లక్ష్మీనారాయణ, బోయడి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరంలోని కొత్తపేట, రాజపేట ప్రాంతాల్లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, రమణమ్మ. ఎడ్ల లక్ష్మి, నల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

అగర్తల : త్రిపురలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని లెఫ్ట్ - కాంగ్రెస్ ప్రతినిధి బృందానికి ఎన్నికల సంఘం శనివారం హామీ ఇచ్చింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) జి.కిరణ్‌కుమార్ దినకరరావుతో సీపీఎం, కాంగ్రెస్‌కు చెందిన తొమ్మిది మంది సభ్యుల బృందం సమావేశమైనప్పుడు ఈ హామీ ఇచ్చారు. 60 మంది సభ్యుల అసెంబ్లీకి ఫిబ్రవరి 16న ఎన్నికలు జరగనున్నాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి, కాంగ్రెస్ ఎమ్మెల్యే సుదీప్ రాయ్ బర్మన్‌తో కూడిన ప్రతినిధి బృందం గత ఐదేళ్లలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేయలేకపోయిన హింసాకాండను ఎత్తిచూపింది. 'గత ఎన్నికల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల ప్రజాస్వామ్య హక్కులను నిర్ధారించాలని కోరుతూ ఈరోజు మేము ఈసీకి ఒక వినతి పత్రాన్ని సమర్పించాము. పంచాయితీ అయినా, లోక్‌సభ అయినా, ఉపఎన్నిక అయినా గత ఐదేళ్లలో ఓటర్లు ఓట్లు వేయలేకపోయారని మీకందరికీ తెలుసు' అని సమావేశం అనంతరం చౌదరి విలేకరులతో అన్నారు. మజ్లీష్‌పూర్ ఘటనపై ఎన్నికల సంఘం ఇప్పటికే విచారణ ప్రారంభించిందని, ఎవరినీ విడిచిపెట్టబోమని సీఈవో ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చినట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తెలిపారు. మజ్లిష్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని జిరానియా సబ్ డివిజన్‌లోని నాలుగు చోట్ల బైక్ ర్యాలీ సందర్భంగా 'బీజేపీ మద్దతు ఉన్న గూండాలు' దాడి చేయడంతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్‌తో సహా 15 మంది పార్టీ కార్యకర్తలు గాయపడ్డారని కాంగ్రెస్ పార్టీ బుధవారం పేర్కొంది. అయితే పశ్చిమ త్రిపుర జిల్లాలో గుర్తు తెలియని దుండగులు దాడులు చేశారని, '10 మంది పార్టీ కార్యకర్తలు గాయపడ్డారని' పోలీసులు తెలిపారు. కాంగ్రెస్ బైక్ ర్యాలీపై జరిగిన దాడులపై ఎన్నికల సంఘం గురువారం విచారణకు ఆదేశించింది. 'స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడంలో ఈసీ విఫలమైతే ప్రజలు వీధుల్లోకి వస్తారని మేము సీఈవోకి చెప్పాము. ప్రజలు తమ ఇష్టప్రకారం ఓట్లు వేసే విధంగా కమిషన్ చర్యలు తీసుకుంటుందని మేము నమ్ముతున్నాము' అని ఆయన అన్నారు. ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడానికి అనుమతించకపోతే ప్రజాస్వామ్యం 'ముప్పులో పడుతుందని' పేర్కొన్న రాయ్ బర్మన్, రాష్ట్రంలోని 40 లక్షల మంది ప్రజల తరపున వినతి పత్రాన్ని సీఈవోకి సమర్పించినట్లు చెప్పారు.

ఏటా ప్రభుత్వమే సీపీ బ్రౌన్ జయంతి నిర్వహించాలి

విశాలాంధ్ర బ్యూరో-కడప: శ్వేత జాతీయుడు సీపీబ్రౌన్ జయంతిని ఏటా ప్రభుత్వమే నిర్వహించాలని జానమద్ది సాహిత్య పీఠం చైర్మన్ విజయభాస్కర్ శనివారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. తెలుగు వెలుగు సూర్యుడిగా కీర్తి పొందిన సీపీ బ్రౌన్, తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తి నివసించిన చోటు కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకోగా. జానమద్ది హనుమచ్ఛాస్త్రి అపార కృషితో ఆ స్థలాన్ని సీపీ బ్రౌన్ పేరిట గ్రంథాలయంగా మార్చేందుకు సంకల్పించారనీ, వయోభారంతో జానమద్ది నాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌కు విషయం విన్నవించగా, ఆయన ప్రత్యేకంగా సీపీ బ్రౌన్ గ్రంథాలయం తెలుగు భాషా పరిశోధన కేంద్రగా రూపుదిద్దేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అలాంటి మహానుభావుడిని యావత్ ఆంధ్రప్రదేశ్ స్మరించుకునే విధంగా గొప్ప ఎత్తున జయంతి కార్యక్రమాలు నిర్వహించి జిల్లాకే ఘనకీర్తి తీసుకురావాలని ఆయన లేఖలో కోరారు.

భ్రష్టుపట్టిన జుమ్లా పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ చార్జిషీటు, రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రజలకు తెలియజేస్తాం' అని అన్నారు. చరిత్రాత్మక భారత్ జోడో యాత్ర 130 రోజులు దిగ్విజయమైందని, యాత్రకు అమితాదరణ పొందిందన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా లక్షలాది మంది తమ బాధలను రాహుల్‌తో పంచుకున్నారని, మోదీ ప్రభుత్వ దుష్టవిధానాలతో ప్రజలు ఎంతలా ఇబ్బంది పడుతున్నారో తెలిసిందన్నారు. హాత్ సే హాత్ జోడోలో భాగంగా పది లక్షల ఎన్నికల పోలింగ్ బూత్‌లను చేరుకుంటామని, 2.5 లక్షల పంచాయతీలు, ఆరు లక్షల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపడతామని వేణుగోపాల్ చెప్పారు. జైరాం రమేశ్ మాట్లాడుతూ 'హాత్‌సే హాత్ జోడో అభియాన్ నూటికి నూరుశాతం రాజకీయ యాత్రని చెప్పలేం. ఇది భారత్ జోడో యాత్ర తరువాయి భాగం' అని అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ శ్రీనగర్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని వేణుగోపాల్ చెప్పగా లాల్ చౌక్‌లో ఎందుకు ఎగురవేయడం లేదని ఓ విలేకరి ప్రశ్నించారు. ఇందుకు జైరాం రమేశ్ స్పందిస్తూ పార్టీ కార్యాలయంలోనే జాతీయ పతాకావిష్కరణ జరుగుతుందన్నారు. భావితరాలు గుర్తించేలా శాశ్వత కట్టడం ఉండాలనే భావనతో సొంత ఆస్తిని కాంగ్రెస్ గుర్తించినట్లు వేణుగోపాల్ తెలిపారు. భారత్ జోడో తుదిదశకు చేరుకున్నదని, కశ్మీర్ లోయలో ఈనెల 27, 28, 29 తేదీల్లో సాగుతుందని చెప్పారు. 29న యాత్ర ముగుస్తుందని, 30వ తేదీ ఉదయం 10గంటలకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని రాహుల్ ఆవిష్కరిస్తారని, 11 గంటలకు శ్రీనగర్‌లోని షేరే కశ్మీర్ మైదానంలో బహిరంగ సభ జరుగుతుందని, ఇందుకు ప్రతిపక్ష నేతలను ఆహ్వానించామని వేణుగోపాల్ తెలిపారు. జాతీయ పతాకాన్ని రాహుల్ ఆవిష్కరించే సమయంలో అన్ని జిల్లాలలో పార్టీ అధ్యక్షులు తమ కార్యాలయాల్లో త్రివర్ణ జెండాలు ఎగురవేస్తారన్నారు. హాత్ సే హాత్ జోడో అభియాన్ రెండు నెలలకుపైగా సాగేందుకు వీలు ఉన్నట్లు వేణుగోపాల్ వెల్లడించారు.

ఆహార భద్రత కరువు

(మొదటిపేజీ తరువాయి)

ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) ప్రభుత్వం తెచ్చింది. ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిలోనే పీడీఎస్ ఉంది. ఎన్ఎఫ్ఎస్ఏ ప్రకారం పీడీఎస్ పరిధిలో 75శాతం గ్రామీణ, 50శాతం పట్టణ జనాభా ఉంది. ఆహార ధాన్యాల కేటాయింపుల్లో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సహకారం ఎన్ఎఫ్ఎస్ఏకు అవసరం. లబ్ధిదారులను గుర్తించడం, పథకం సమర్థంగా అమలు కావడంలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కీలకం. ప్రభుత్వ తాజా డేటా ప్రకారం 81.34 కోట్ల మంది ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిలో ఉన్నారు. అయితే ఈ పథకానికి అర్హులైన వారి సంఖ్యతో పోల్చితే లబ్ధిదారుల సంఖ్య తక్కువని నిపుణులు అన్నారు. రేషన్‌కార్డుల సమస్యను పరిష్కరించడానికి ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిని విస్తరించాలనే డిమాండ్ కొనసాగుతోంది. జనగణన ఆధారంగా లబ్ధిదారుల లెక్కింపు ఉంటుంది. చివరిసారి 12ఏళ్ల కిందట జనగణన జరిగింది. ఈ క్రమంలో 2011 జనగణన డేటా ఆధారంగా లబ్ధిదారుల సంఖ్య ఉన్నది. ఆ తర్వాత జనాభా పెరుగుదలను పరిగణనలోకి తీసుకోకుండానే రేషన్ కార్డులను ప్రభుత్వం కేటాయించింది. కాగా దాదాపు పది కోట్ల మంది పీడీఎస్ పరిధిలో లేరని ఆర్థికవేత్తలు జీన్ డ్రేజ్, రీతికా ఖేరా పేర్కొన్నారు.

కోవిడ్-19 లాక్‌డౌన్ కారణంగా 2021లో జరగాల్సిన జనగణన వాయిదా పడింది. 2022, జులై 28న లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కోవిడ్ వల్ల జనాభా లెక్కలు-2021ను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేసినట్లు కేంద్రం తెలిపింది. 2023, జనవరి 2న ది రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్జీఐ) పరిపాలనపరమైన గడువును జూన్ వరకు పొడిగించింది. అంటే 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల వరకు ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం లేదు.

ప్రపంచ ఆకలి సూచీ-2022లో 121 దేశాలలో 107వ స్థానంలో భారత్ ఉంది. దీనినిబట్టి దేశంలో ఆకలి సమస్య ఏ స్థాయిలో ఉన్నది తెలుస్తోంది. సామాజికార్థిక పరిస్థితులపరంగానూ మహమ్మారి కారణంగా తీవ్రత పెరిగింది. వలస కార్మికులకు కేంద్రంగా దిల్లీ ఉంది. జనాభా పెరిగేకొద్దీ కొత్త రేషన్‌కార్డుల అవసరం పెరుగుతోంది. 2021 జులైలో 'బంధువా ముక్తి మోర్చా' దాఖలు చేసిన పిటిషన్‌లో మినహాయింపు గురించి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఎన్ఎఫ్ఎస్ఏ పరిధి విస్తరణ అవసరమని న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఎన్ఎఫ్ఎస్ఏ ప్రయోజనాలు 2011 జనాభా డేటాకు పరిమితం కాకుండా ఒక ఫార్ములా సిద్ధం చేయాలని కేంద్రానికి సూచించింది.

జనగణన డేటా అందుబాటులో లేదని, ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిని పెంచాలంటే సవరణ అవసరమని కేంద్రప్రభుత్వం అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించింది. జనాభా పెంపుదల దృష్ట్యా లబ్ధిదారుల సంఖ్యను పెంచాల్సి ఉన్నాగానీ ఇన్నేళ్లలో పేదల జనాభా తగ్గడాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వ అఫిడవిట్ వెల్లడించింది. 2013లో ఎన్ఎఫ్ఎస్ఏ అమల్లోకి వచ్చినప్పటి నుంచి దేశ జనాభా తలసరి ఆదాయం 33.4శాతం పెరిగిందని నీతిఆయోగ్ అందులోలో వాదించింది. గ్రామాల్లో 75శాతం, పట్టణాల్లో 50శాతం జనాభా ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిలో ఉన్నట్లు తెలిపింది. కాగా, ప్రస్తుత పరిస్థితులను ప్రభుత్వం తప్పుగా అన్వయించుకున్నదని నిపుణులు అంటున్నారు. తలసరి ఆదాయం ఆధారంగా ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిని నిర్ణయించడం తగదని, ఆదాయం-సంపద మధ్య అసమానతను ప్రభుత్వం పట్టించుకోలేదని నిపుణులు అభిప్రాయపడ్డారు.

జగన్ దళిత ద్రోహి: ఆనంద్‌బాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జగన్‌ని నమ్మి ఓట్లేసిన పాపానికి దళితులకు రాష్ట్రంలో నిర్బంధాలు, బేడీలు, అవమానాలు, వేధింపులే మిగిలాయని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వస్తే దళిత సంక్షేమానికి పెద్దపీట వేస్తానన్న జగన్, కత్తివేటు వేశాడన్నారు. సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించకూడదని చట్టం చెబుతున్నా, కావాలనే దళితసొమ్ముని దుర్వినియోగం చేస్తున్నాడన్నారు. రాష్ట్రంలో సబ్ ప్లానే అమల్లో లేని విషయం స్పష్టంగా కనపడుతుంటే, దేశంలోనే సబ్ ప్లాన్ అమల్లో ఏపీ టాప్ ప్రచారం చేసుకోవడం శోచనీయమన్నారు. రేషన్ బియ్యం, వృద్ధాప్య, వితంతు పింఛన్లు, అమ్మఒడి కింద చేసే సాయం అన్నివర్గాలకు అమలయ్యే పథకాల్లో భాగంగా దళితులకు భాగస్వామ్యం కల్పిస్తున్నారే తప్ప, ప్రత్యేకంగా దళితులకోసం జగన్, ఆయనప్రభుత్వం ఒక్క పథకమైనా అమలుచేసిందా ? అని ప్రశ్నించారు. రాజధానిలో అంబేద్కర్ స్మృతివనం నిర్మాణం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం రూ.157కోట్లు కేటాయించి, 26శాతం పనులు పూర్తి చేస్తే, జగన్ దాన్ని రద్దుచేశాడన్నారు. అక్కడి పనులన్నీ ఆపేయించి, దానికోసం కేటాయించిన నిధుల్ని దుర్వినియోగం చేశాడని మండిపడ్డారు. దళితులకు నూటికి వెయ్యిశాతం ద్రోహం చేసిన జగన్‌కు భజన చేస్తూ, దళిత జాతికి ద్రోహం చేస్తున్న మంత్రులు, వైసీపీ ప్రజాప్రతినిధులు ఇకనైనా ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరారు. లోకేశ్ పాదయాత్రను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ నియంత పాలనకు చరమగీతం

జగదీశ్ పిలుపు

విశాలాంధ్ర-గుంతకల్లు: ముఖ్యమంత్రి జగన్ నియంత పోకడల కారణంగా హైకోర్టులో ప్రతిపక్ష పార్టీలు సొంతంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ చెప్పారు. సీపీఐ విస్తృత కార్యవర్గ సమావేశం శనివారం అనంత పురం జిల్లా గుంతకల్లులోని పార్టీ కార్యాలయంలో జరిగింది. సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్ అధ్యక్షత వహించారు. జగదీశ్ మాట్లాడుతూ కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం హైకోర్టు అనుమతితో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాదయాత్ర చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ప్రత్యేక హోదా సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు తలపెట్టిన బస్సుయాత్రకు సైతం జగన్ ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని, దీని కోసం కూడా హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని చెప్పారు. జనవరి 27న టీడీపీ నేత నారా లోకేశ్ తలపెట్టిన పాదయాత్రకు సీఎం జగన్ అనుమతి ఇస్తారనే నమ్మకం లేదన్నారు. జగన్‌కు ఓటమి భయం పట్టుకున్నఆందని, అందుకే జీవో నంబరు 1 తీసుకొచ్చి ప్రతిపక్షాలపై ప్రయోగిస్తున్నారని విమర్శించారు. సభలు, సమావేశాలు, రోడ్ షోలపై నిషేధం విధిస్తూ తీసుకొచ్చిన జీవో 1పై తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హైకోర్టును ఆశ్రయించారని, దీనిని హైకోర్టు నిలిపివేసిందని చెప్పారు. దీనిపైనా జగన్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా...అక్కడా ప్రభుత్వానికి చీవాట్లు తప్పలేదన్నారు. న్యాయస్థానాలు ఎన్ని మొట్టికాయలు వేసినా జగన్ నిస్సిగ్గుగా సీఎం కుర్చీని అంటిపెట్టుకొని కూర్చున్నారని వ్యాఖ్యానించారు. ప్రజలే ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే పరిస్థితులు వచ్చాయన్నారు. ఈ రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడటం కోసం ప్రజాఉద్యమాలలో వేగం పెంచాలని కార్యకర్తలకు ఉద్బోధించారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బి.మహేశ్, నాయకులు రాము, మహమ్మద్ గౌస్, దేవేంద్ర, రామాంజనమ్మ, వెంకట్ నాయక్, వినోద్, శివానంద తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అన్ని రైళ్లకు ఎల్‌హెచ్‌బీ బోగీలు

విశాలాంధ్ర- విజయవాడ(గాంధీనగర్): లింక్ ఆఫ్ మెన్‌బుష్ (ఎల్‌హెచ్‌బి) కోచ్‌లను త్వరలో అన్ని రైళ్లకు ప్రవేశపెట్టనున్నట్టు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ప్రస్తుతం విశాఖ ఎక్స్‌ప్రెస్ ఈ బోగీలతో నడుస్తోందన్నారు. వీటి ప్రవేశంలో ప్రయాణికుల భద్రతతో పాటు వేగంగా వెళుతున్న సమయంలో కుదుపులు లేకుండా ఉండే విదేశీ టెక్నిలజీతో వీటిని రూపొందాయని వివరించారు. ఇప్పటికే సికింద్రాబాద్-భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను ఇవే కోచ్‌లతో నడపుతున్నట్టు తెలిపారు. దూర ప్రయాణికుల అవసరాలు, భద్రత దృష్టిలో ఉంచుకొని దానికి అనుగుణంగా ఈ కోచ్‌ల్లో మార్పులు చేశామన్నారు. మొదటి రోజు నుండే 100% కంటే ఎక్కువ వినియోగం నమోదైందని పేర్కొన్నారు. కోస్టల్ ఆంధ్ర-ఒడిశా వైపు ప్రయాణించే ప్రజలు ఎక్కువగా ఎంపిక చేసుకొనే రైలు విశాఖ ఎక్స్‌ప్రెస్. సాధారణంగా సెలవులు, పండుగల సీజన్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఈ రైలులో ప్రయాణించే సమయం దాదాపు 23 గంటలు. అందువల్ల సుదూర ప్రయాణికులు ఎక్కువగా ఏసీ ప్రయాణాన్ని ఇష్టపడతారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని., ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, పెరిగిన ఏసీ కోచ్‌లతో రైలు మార్పులు చేశారు. ఈ కోచ్‌లు మెరుగైన భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తాయి. దశలవారీగా అన్ని రైళ్లకు ఎల్‌హెచ్‌బి కోచ్‌లను ప్రవేశపెట్టనున్నారు.

ఈపీడీసీఎల్ నివేదిక బూటకం

జేవీ సత్యనారాయణమూర్తి విమర్శ

విశాలాంధ్ర-విశాఖ: ఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఏపీ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రూపొందించిన నివేదికలో అనేక తప్పులున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. విశాఖలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈపీడీసీఎల్ నివేదిక బూటకమని, దాన్ని రద్దు చేయాలని, కొత్త నివేదిక రూపొందించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పంపిణీ వాణిజ్య నష్టాలను ఒక్కోచోట ఒక్కో విధంగా చూపించారని విమర్శించారు. దీనిపై సీపీఐ అభ్యంతరాలు లేవనెత్తిన తర్వాత మొదటి పేజీలో మార్పులు చేశారని చెప్పారు. అలాంటి నివేదిక తయారు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు లెక్కలతోనే పనితీరులో ఈపీడీసీఎల్ ప్రథమస్థానంలో ఉందంటూ అవార్డులు పొందుతున్నారని విమర్శించారు. వ్యవసాయ విద్యుత్‌కి సంబంధించి వాస్తవ లెక్కలు చెప్పలేదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించేందుకు ఈఆర్సీ సుముఖంగా లేదని విమర్శించారు. ప్రత్యక్షంగా నిర్వహిస్తే వివిధ అంశాలను నేరుగా ఈఆర్సీ దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లకు 100 శాతం స్మార్ట్ మీటర్లు బిగించారని, మిగిలిన జిల్లాల్లో 59 శాతం బిగించినట్లు పేర్కొన్నారని, వీటి ఆధారంగా సరాసరి లెక్కలు కచ్చితంగా అంచనా వేయవచ్చన్నారు. నివేదికలో ఊహాజనిత లెక్కలు పొందుపరచడం అభ్యంతరకరమని స్పష్టంచేశారు.

జగనన్న పట్టాల లబ్ధిదారులపై ఆర్థికభారం పడకుండా ప్రతి ఇంటిని ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని, లేనిపక్షంలో ఐదు లక్షల రూపాయల వంతున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలన్నారు. జగనన్న ఇళ్ళు, టిడ్కో ఇళ్లపై లబ్ధిదారులతో కలిసి ప్రచార ఆందోళనలు చేపట్టినట్టు తెలిపారు. లబ్ధిదారులతో కలిసి కలెక్టర్‌కి వినతి పత్రాలు అందజేస్తామన్నారు. విశాఖ ఉక్కు కర్మాగార పరి రక్షణ కోసం సీపీఐ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా జనవరి 23న పెందుర్తి, 24న భీమిలి, 25న జీవీఎంసీ గాంధీ విగ్రహం ముందు దీక్షలు చేపడుతున్నామని, 30న ఉక్కు నగరంలో జరిగే కార్మిక సంఘాల గర్జనకు సీపీఐ సంఘీభావం తెలుపుతూ ఆందోళనలో పాల్గొంటుందని తెలిపారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్షేత్రపాల్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించే వరకు

పోరాటాలు ఆపవద్దు

ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-మచిలీపట్నం: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తున్న విధానాన్ని మనందరం తిప్పి కొట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గౌరిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చాకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ రైతుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చి సంవత్సరం దాటినప్పటికీ, వాటిని పరిష్కరించలేదని తెలిపారు. కమిషన్ సిఫారసు ఆధారంగా రైతులకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చేసేందుకు చట్టం చేయాలని, దానిపై కొత్త కమిటీని నియమించి, రైతాంగానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆయన కోరారు. వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోవడం వల్ల 80 శాతం మంది రైతులు తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, రైతు, కౌలు రైతుల రుణాలన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న రైతులు నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ట్రాక్టర్ ర్యాలీ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ఇన్‌ఛార్జి కార్యదర్శి తాటిపర్తి తాతయ్య, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు లింగం ఫిలిప్, ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షులు ఒంటి పులి లక్ష్మణరావు, తూము కొండయ్య, ఓడుగు లక్ష్మణ కుమార్, ఓడుగు రత్నకుమారి, బండి అరుణ ప్రసాద్, యక్కల పితాంబరధరరావు, అనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, వేమూరి రత్నగిరి రావు, వై.కేశవరావు, గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలో ప్రభుత్వ ఆస్తుల తాకట్టు

ఈశ్వరయ్య విమర్శ

విశాలాంధ్ర-పార్వతీపురం: ప్రభుత్వ రంగ సంస్థలను వరుసగా ప్రైవేటుపరం చేసిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కిందని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య విమర్శించారు. సీపీఐ మన్యం జిల్లా కార్యవర్గసభ్యులు, సమితి సభ్యుల సర్వసభ్య సమావేశం రిటైర్డు ఉద్యోగుల సంఘం భవనంలో శనివారం జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కోరంగి మన్మథరావు అధ్యక్షత వహించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎల్ఐసీ, బ్యాంకులు, స్టీల్‌ప్లాంట్ తదితర కేంద్రప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం దారుణమని నిందించారు. నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందకుండా చేసిన ఘనత కేంద్ర, రాష్ట్రాలకు దక్కుతుందన్నారు. పాలకుల విధానాల కారణంగా పేద, బడుగు, మధ్యతరగతి, బలహీనవర్గాల జీవన విధానం క్షీణించిందన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందని, అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను జగన్ ప్రభుత్వం ఇంతవరకు పూర్తిచేయలేదన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నట్లు చెబుతున్న జగనన్న కాలనీల్లో ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరలేదన్నారు. మోదీ, జగన్ ప్రభుత్వాలను సాగనంపడానికి ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఆ రెండు ప్రభుత్వాలను గద్దెదించడం ఖాయమన్నారు. సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, మన్యం జిల్లా సహాయ కార్యదర్శి జీవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు, ఈదుబిల్లి వెంకటనాయుడు, గరుగుబిల్లి సూరయ్య, ఎస్.దుర్గారావు, బీటీ నాయుడు, ఎస్.కిరణ్ కుమార్, మండంగి లింగరాజు, నాగ భూషణరావు, కోరంగి గోపినాయుడు పాల్గొన్నారు.

ఢిల్లీకి వినపడేలా రాయలసీమ నినాదం

- ఎమ్మెల్యేలు, ఎంపీలు మొద్దు నిద్ర వీడేలా పోరాటం
- తీగల వంతెన వద్దు... బ్యారేజీ కమ్ బ్రిడ్జి కావాలి
- రాయలసీమ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ బైరెడ్డి

విశాలాంధ్ర-కొత్తపల్లి: రాయలసీమ ప్రాంత ప్రజలందరూ ఐక్యమై ఢిల్లీ పెద్దలు కళ్లు తెరిచేలా పోరాటాలు చేసి, రాయలసీమ నినాదం ఢిల్లీకి వినిపించేలా చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ బైరెడ్డి రాజశేఖర రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటీషు కాలం నుంచి రాయలసీమ ప్రాంత ప్రజలకు అన్యాయం చేస్తూ, ఈ ప్రాంతంలో ఉన్న అనేక ప్రాజెక్టుల నుంచి నీటిని తీసుకొని అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. అయితే రాయలసీమ ప్రాంతాన్ని రాళ్లసీమగా మార్చి రాయలసీమ త్యాగాల ఫలాలను అనుభవిస్తూ అన్యాయం చేస్తున్న పార్టీలకు ఈ ప్రాంత ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. 1880వ సంవత్సరంలో అప్పటి బ్రిటీషు ప్రభుత్వం సిద్దేశ్వరం-సోమశిల రెండు కొండల నడుమ కృష్ణా, పెన్నార్ ప్రాజెక్టు నిర్మించాలని సర్వే కూడా చేసిన దాఖలాలు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేసి ఉంటే రాయలసీమ ప్రాంతమంతా సస్య శ్యామలంగా ఉండేదని అన్నారు. అయితే దీనికి బదులుగా అప్పట్లో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి వందల గ్రామాలను ఖాళీ చేయించారే గానీ ప్రాజెక్టు నిర్మాణంలో సర్వస్వం కోల్పోయిన జీవితాలు నేటికీ అంధకారంలోనే ఉన్నాయన్నారు. సీమలో ఏ ప్రాజెక్టు నిర్మించినా కాంట్రాక్టర్లు, సంబంధిత ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల అభివృద్ధికే తప్ప ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడలేదన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రూ.1,200 కోట్లతో తీగల వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టి నిధులు కూడా విడుదల చేసిందని, కానీ ఆ వంతెన వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఒరిగేదేమీలేదన్నారు. రూ.700 కోట్లతో బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మిస్తే 70 టీఎంసీల నీటిని నిల్వ చేసుకొని రాళ్లసీమగా ఉన్న ప్రాంతాన్ని రతనాల సీమగా మార్చుకునేందుకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. రాయలసీమకు కావాల్సింది తాగు, సాగు నీరు, పరిశ్రమలు, ఉద్యోగాలు కల్పించాలే తప్ప మోసపూరిత మాటలు కావన్నారు. ముఖ్యమంత్రులుగా రాయలసీమ నేతలు ఉన్నా సీమకు ఎలాంటి ఫలితం లేదన్నారు. సీమ సస్యశ్యామలం కోసం, నీళ్లు, నిధులు, నియామకాల సాధన కోసం ఈ నెల 28న చలో సిద్దేశ్వరం వద్ద చేపట్టనున్న రాయలసీమ ప్రజాప్రదర్శనను జయప్రదం చేయాలని, రాయలసీమ వాసులు, అధికార, ప్రతిపక్ష నేతలు పార్టీలకతీతంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు నాగేశ్వర రావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, కొడక్రింది వెంకటరెడ్డి రామకృష్ణారెడ్డి, మల్లెల కృష్ణారెడ్డి, శంకర్ గౌడ్, షఫివుల్లా, నారాయణ, రమణ, వెంకటేశ్వర్లు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హేతువాద సంఘం చైర్మన్

రావిపూడి వెంకటాద్రి మృతి

- 100కు పైగా పుస్తకాల రచన
- 40 ఏళ్లపాటు స్వగ్రామానికి సర్పంచ్
- నేడు నాగండ్లలో అంత్యక్రియలు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల: భారత హేతువాద సంఘ చైర్మన్, హేతువాది మాస పత్రిక ఎడిటర్, బహుగ్రంథ రచయిత రావిపూడి వెంకటాద్రి శనివారం సాయంత్రం చీరాలలో మృతి చెందారు. 20 రోజులుగా వయోభార బాధపడుతూ మృతి చెందినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. 1922 ఫిబ్రవరి 9న ఇంకొల్లు మండలం నాగండ్లలో జన్మించిన వెంకటాద్రి 40 ఏళ్లు గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. 100 ఏళ్లు జీవించిన వెంకటాద్రి మానవుడిని మానవుడిగా గుర్తించి మానవతా విలువలతో జీవించాలని ప్రజలను ఎంతో చైతన్యవంతులను చేశారు. ఎంఎన్ రాయ్ భావాలకు ఆకర్షితులై ర్యాడికల్ డెమోక్రటిక్ పార్టీలో చేరి మూడేళ్లకే ర్యాడికల్ హ్యూమనిస్టు ఉద్యమంలో భాగస్వామి అయ్యారు. 1949లో ఏర్పాటైన భారత హేతువాద సంఘం స్థాపన నుంచి వెంకటాద్రి సభ్యులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘంలో 1989 వరకు అధ్యక్షులుగా పనిచేసి విశిష్ట ఖ్యాతిని గడించారు. 1982లో హేతువాది మాసపత్రిక ప్రారంభించి తన కలంతో భావాలను వ్యక్తం పరుస్తూ ప్రజలను చైతన్యపరిచారు. 1988, 1996లో రెండుసార్లు కవిరాజు త్రిపురనేని అవార్డు పొందారు. 1992లో తాపీ ధర్మారావు అవార్డును పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అందుకొన్నారు. రావిపూడి వెంకటాద్రి మృతి పట్ల భారత హేతువాద సంఘం, ఆంధ్ర ప్రదేశ్ హేతువాద సంఘం, రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్, ఇంకొల్లు హేతువాద సంఘం, హేమా పబ్లికేషన్స్ ,రేషనలిస్టులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆదివారం నాగండ్లలో అంత్యక్రియలు జరుగుతాయని సన్నిహితులు తెలిపారు.

నారాయణ సంతాపం: వందేళ్లు పూర్తిచేసుకున్న రావిపూడి మృతికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ సంతాపం తెలిపారు. ఆయన సంపూర్ణ మానవుడిగా మూర్తీభవించి మంచిమరణం పొందారని తెలిపారు. రామ భక్తుడుగావున్న రావిపూడి త్రిపురనేని రామస్వామి చౌదరి ప్రభావంతో హేతువాదిగా మారారని గుర్తుచేశారు. 80 ఏళ్లుగా 'హేతువాద యెత్తినజండా' వదలకుండా నిబద్ధతతో శ్రమించారన్నారు. హేతువాదంపై మూఢభక్తులు అనేక రకాలుగా వారిపై సైద్ధాంతికదాడి చేసినా మడం తిప్పని ఆదర్శవాది రావిపూడిగా పేర్కొన్నారు.

హమాలీల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ డైరీ ఆవిష్కరణలో హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

విశాలాంధ్ర-గుంటూరు: తిరుపతిలో ఈ నెల 29, 30 తేదీలలో జరుగనున్న హమాలీ ముఠా జట్టు కళాసి రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లా చిన ఆంజనేయులు, ఎస్.వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ముద్రించిన మినీ డైరీని హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు శనివారం గుంటూరు రేగుల రాఘవయ్య భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ డైరీలో అనేక కార్మిక చట్టాలకు సంబంధించిన అంశాలు, ఇతర సామాజిక అంశాలు ఉన్నాయని అన్నారు. ఈ డైరీ కార్మిక నాయకులకు కరదీపికలా ఉపయోగపడుతుందని తెలిపారు. తిరుపతి నగరంలో జరిగే రాష్ట్ర మహాసభల్లో హమాలీ కార్మికులకు సంక్షేమ చట్టం కోసం, సామాజిక భద్రత చట్టాల కోసం, ఉద్యోగ భద్రత, ఆర్థిక ప్రగతి కోసం చర్చించి నిర్ణయిస్తామన్నారు. ప్రతి ఒక్క హమాలీ కదిలి కచ్చితంగా మహాసభలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభతో ప్రభుత్వం దిగి వచ్చేలా పోరాటాలకు రూపకల్పన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జీవీ సురేష్, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

హమాలీ రాష్ట్ర మహాసభకు తరలిరండి

రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపు

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్: జనవరి 29,30 తేదీలలో తిరుపతిలో జరగబోయే హమాలీ, ముఠా, జట్టు, కళాసీ రాష్ట్ర మహాసభలకు భారీగా తరలిరావాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏఐటీయూసీ అనుబంధ సంస్థలతో రవీంద్రనాథ్ శనివారం సమావేశమయ్యారు. ఏఐటీయూసీ జాతీయ మహాసభలు, రాష్ట్ర మహా సభల వివరాలను రవీంద్రనాథ్ వెల్లడించారు. తిరుపతిలో జరిగే రాష్ట్ర మహాసభలకు హమాలీలు భారీగా హాజరు కావాలన్నారు. హమాలీ కార్మికుల కోసం ప్రభుత్వ సంక్షేమ బోర్డు ఏర్పాటుపై మహాసభ కూలంకషంగా చర్చిస్తుందని చెప్పారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పడిందని, ప్రస్తుతం ఆ సంక్షేమ బోర్డులో రూ.2000 కోట్ల డబ్బు ఉందన్నారు. మున్సిపల్ కార్మికులకు 8 వేల రూపాయలు జీతం ఇచ్చేవారని, ఏఐటీయూసీ కృషి ఫలితంగా రూ.21 వేల వేతనం తీసుకుంటున్నారని తెలిపారు. సీపీఐ మార్కాపురం నియోజకవర్గ నాయకులు అందే నాసరయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు షేక్ ఖాసిం, అనుబంధ సంఘాల సభ్యులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత నీరు

విశాలాంధ్ర బ్యూరో- అనంతపురం: అనంతపురం జిల్లాలోని ప్రతి ఇంటికీ సురక్షిత నీటిని అందిం చడమే జల్ జీవన్ మిషన్ ముఖ్య లక్ష్యమని జాతీయ జల జీవన్ మిషన్ కేంద్ర కమిటీ సభ్యుడు, రిటైర్డ్ ఐఏఎస్ కపిల్దేవ్ శర్మ, కులదీప్ బద్వాల్ తెలిపారు. శనివారం అనంతపురం రూరల్ మండలం, కామారుపల్లి, చిన్నంపల్లి, సజ్జల కాలువ, కురుగుంట, కట్టకిందపల్లి గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి సంబంధిత శాఖల రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామ వీధుల్లో పర్యటించి ఏర్పాటు చేసిన కుళాయిలను, నీటి సరఫరాను పరిశీలించారు. నీటి నాణ్యత పరీక్షల పైన, గ్రామాల్లో ప్రతీ ఇంటికీ అందించిన నీటి కుళాయిల నాణ్యత పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టులో 2024 లోపు ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్ఎస్ఈ ఎహసాన్ బాషా, జేజేఎం జాతీయ బృందం అధికారులతో మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోనూ గ్రామీణ తాగునీరు, పారిశుధ్య కమిటీలను ఏర్పాటు చేశామని, గ్రామాల్లో ఉన్న ప్రతీ ఇంటికీ 55 ఎల్పీసీడీ ప్రకారం నీటి కుళాయిలను అందించామన్నారు. డీఈఈ వసీమా రెహానా, ఏఈ ఆంజనేయులు, జేజేఎం డీపీఎం నాగాంజనరెడ్డి, డిస్ట్రిక్ ఐఎస్ఏ కో-ఆర్డినేటర్ పి.నరేశ్, ఐఈసీ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ మౌళీశ్వరుడు, వాటర్ క్వాలిటీ ల్యాబ్ ఇన్‌చార్జ్ హరినాథ్ రెడ్డి, ఎస్‌బీఎం కో-ఆర్డినేటర్ వి.శ్రీనివాసులు, సర్పంచులు లక్ష్మీకళ, లక్ష్మిదేవి, బి.శోభవరప్రసాద్ రెడ్డి, ఎం. శివ శంకర్, పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, సర్దార్ వలీ, రైజెస్ ఎన్జీఓ ప్రతినిధులు వెంకటేశ్, శ్రీనివాసులు, ఓబులాపతి, ఉమాదేవి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పవన్‌ను సీఎం చేస్తాం

నాగబాబు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: రాష్ట్రానికి పవన్ కల్యాణ్‌ను సీఎంను చేయడమే లక్ష్యంగా 2024 ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నామని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు నాగబాబు స్పష్టం చేశారు. శనివారం కర్నూల్ నగరంలోని ఓ హోటల్‌లో వీర మహిళలు, జనసైనికులతో ఆయన ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ నేతలపై నిప్పులు చెరిగారు. వైసీపీ ఒక పార్టీయేనా? అని విమర్శించారు. అరాచకం, దుర్మార్గం, దౌర్జన్యం కలిస్తే వైసీపీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పొత్తులు ఖరారు తర్వాత ఎవరు ఎక్కడ పోటీ చేయాలో నిర్ణయం జరుగుతుందని ఆయన వెల్లడించారు. గ్రామస్థాయి నుంచి జనసైనికులు బలంగా ఉన్నారని ఆయన తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఇన్చార్జిలను నియమించాలని ఆయన పార్టీ నాయకులకు సూచించారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు షేక్ హర్షద్, రేఖ గౌడ్, హసీనా బేగం, సురేశ్, శిరీష పాల్గొన్నారు.

రెండు నెలల్లో విశాఖకు రాజధాని

ఇన్ఫినిటీ సదస్సులో మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మరో రెండు నెలల్లో విశాఖకు పరిపాలన రాజధాని తరలిరానున్నదని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడించారు. ఐటీ ఇన్ఫినిటీ సదస్సులో అమర్నాథ్ మాట్లాడుతూ రానున్న మూడు నెలల్లో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుతోపాటు జీ-20 వంటి ప్రతిష్ఠాత్మక సదస్సులు విశాఖ రాజధాని నగరంలో జరగబోతున్నాయని చెప్పారు. విశాఖ బీచ్ ఐటీ గమ్యస్థానంగా విశాఖ రూపుది ద్దుకోబోతోందని చెప్పారు. ఇప్పటికే రాండ్‌స్టెడ్ పనులు ప్రారంభమయ్యాయని, విప్రో, ఐబీఎం వంటి ఐటీ దిగ్గ జాలు త్వరలో విశాఖ నుంచి కార్యకలాపాలు ప్రారంభించనున్నాయని మంత్రి అమర్నాథ్ పేర్కొ న్నారు. 14 వేల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న అదానీ డేటా సెంటర్‌కు మరొక పది, పదిహేను రోజుల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారన్నారు. పక్క రాష్ట్రాలతో పోలిస్తే ఐటీ రంగంలో ఆంధ్రప్రదేశ్ వెనక బడిందన్న ప్రచారం సరికాదని అమర్నాథ్ అన్నారు. హైదరాబాద్‌లో 30 సంవత్సరాల కిందటే ఐటీ పరిశ్రమలకు బీజం పడిందని, రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఐటీ రంగానికి ప్రాధాన్యత పెరిగిందని, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా హైదరాబాదులో హైటెక్ సిటీకి శంకుస్థాపన జరిగిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి హైదరాబాదులో ఐటీ పరిశ్రమలు అభివృద్ధి చెందాయన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ పరిశ్రమ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందని ఆయన చెప్పారు. సీఎం జగన్ ఐటీరంగంలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి అమర్నాథ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ ఉద్యోగులకు కొరతలేదని, తెలంగాణలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులలో 10శాతం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారేనని చెప్పారు.

ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) క్యాలెండర్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు పి.మధు ఆవిష్కరించారు. లెనిన్ విగ్రహం వద్ద శనివారం ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సీపీఐ కేంద్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి ర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఓబులేసు, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, నగర కార్యదర్శి ఎం. సాయి కుమార్, మహిళా విభాగం కన్వీనర్ మోతుకూరి అభ్యుదయ, అయ్యప్ప పాల్గొన్నారు.

సంపాదకీయం

క్రీడాకారిణులపై లైంగిక వేధింపులు

ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో ఏదో ఒక అంశంపై నిరసన ప్రదర్శనలు జరుగుతుంటాయి. అన్నా హజారే నాయకత్వంలో అవినీతి వ్యతిరేకోద్యమం అక్కడే జరిగింది. ఒకే ర్యాంకు, ఒకే పింఛన్ కావాలని మాజీ సైనికులు అక్కడే ఉద్యమించారు. నిర్భయ మీద మూకుమ్మడి అత్యాచారం జరిగినప్పుడూ జంతర్ మంతర్ నిరసనోద్యమ కేంద్రమైంది. గత బుధవారం చాలా విచిత్రంగా జంతర్‌మంతర్‌లో అపూర్వమైన నిరసన వ్యక్తం అయింది. టోక్యో ఒలంపిక్స్‌లో మల్లయుద్ధంలో కాంస్య పతకం సాధించిన బజ్‌రంగ్ పునియా, ప్రపంచ చాంపియన్‌షిప్ సాధించిన వినేష్ ఫొగాట్‌తో పాటు భారత మల్లయుద్ధ సమాఖ్య అధ్యక్షుడికి వ్యతిరేకంగా అనేకమంది మల్లయోధులు, క్రీడాకారిణులు నిరసన ప్రదర్శనకు దిగారు. భారత మల్లయుద్ధ సమాఖ్య అధ్యకుడు బ్రిజ్‌భూషణ్ శరన్‌సింగ్ తమను లైంగికంగా వేధించినందుకు ఈ మహిళా మల్ల యోధులు నిరసన వ్యక్తం చేయవలసిన దుస్థితిలో పడిపోయారు. ఆ సమాఖ్యలోని అనేకమంది కోచ్‌లు కూడా లైంగికంగా తమను వేధిస్తుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 29 మంది కోచ్‌లమీద ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. ఇందులో వివిధ క్రీడలకు, రాష్ట్రాలకు చెందిన కోచ్‌లు ఉన్నారు. ఫిర్యాదులు వచ్చినా ఎంతమందికి శిక్షపడిందో తెలియదు. అంతా రహస్యమే. ఈ క్రమంలో అవమానాన్ని భరించలేక ఆత్మహత్యలకు పాల్పడ్డ క్రీడాకారుణులూ ఉండొచ్చు. ఆరోపణలు వచ్చినప్పుడు ఎఫ్.ఐ.ఆర్.లు దాఖలయ్యాయా, ఒకవేళ దాఖలైతే ఎవరినైనా అరెస్టు చేశారా అన్న ప్రశ్నలకూ సమాధానం ఏ దిశనుంచీ వినిపించదు. అరుదుగా అరెస్టులు జరిగితే జరిగి ఉండవచ్చు, కానీ తప్పు చేశారన్న ఆరోపణలను ఎదుర్కొన్న వారికి శిక్షపడ్డ సందర్భాలు ఉదాహరణ ప్రాయంగానైనా కనిపించవు. నిరసన తెలియజేస్తున్నవారి ప్రతినిధులకు, క్రీడాశాఖమంత్రికి మధ్య గురువారం పొద్దుపోయేదాకా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. కానీ బ్రిజ్‌భూషణ్ మాత్రం రాజీనామా చేయలేదు. తాను ఎన్నికై వచ్చినవాడినంటున్నారు. ఆయన మూడోసారి బీజేపీ పార్లమెంటు సభ్యుడు. అందుకని ఆయనను ముట్టుకోవడానికి క్రీడా సంఘాల అధిపతులు, కడకు క్రీడాశాఖమంత్రి అనురాగ్ ఠాకూర్ కూడా జడుస్తారు. పైగా నేను నోరువిప్పితే సునామీ వస్తుందని బ్రిజ్ భూషణ్ బహిరంగంగానే ప్రకటించారు. అంటే చట్టం లాంటివి అధికారపార్టీకి చెందిన రాజకీయ నాయకులకు వర్తించే పరిస్థితి లేనట్టేకదా! ఒకవేళ ఏవో కొన్ని సందర్భాలలో ఎఫ్.ఐ.ఆర్.లు దాఖలై విచారణ జరిగినా ఆ మహిళా క్రీడాకారులు తమ అసలు పనివదిలేసి న్యాయస్థానాల మెట్లెక్కి దిగడంతోనే సరిపోతుంది. లైంగికవేధింపులకు గురైన మహిళలు ఎంత ప్రసిద్ధులైనా, ఏదో ఒకరంగంలో నిష్ణాతులైనా తాము వేధింపులకు గురయ్యామని చెప్పడానికి జంకుతారు. ఫిర్యాదుచేస్తే మరోసారి పరువుపోతుందని భయపడతారు. వేధింపులకు గురైన మహిళా క్రీడాకారులు ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఆ సంస్థకు అధ్యక్షులు ప్రఖ్యాత క్రీడాకారిణి పి.టి.ఉష అయినా బాధితులకు దక్కిన రక్షణ ఏమీలేదు. దీనిపై ఓ దర్యాప్తు సంఘాన్ని ఏర్పాటుచేశారు. టోక్యో ఒలంపిక్స్‌లో పతకం చేజారినందువల్ల బ్రిజ్ భూషణ్ తనను వేదించుకు తిన్నారని వినేశ్ ఫొగట్ అనే క్రీడాకారిణి ఆరోపించారు. "నీవు చెల్లని నాణానివి" అని బ్రిజ్ భూషణ్ ఏడిపించుకు తిన్నారు. వినేశ్ ఫొగట్ ఆత్మహత్య చేసుకోవాలనుకునేదాకా పరిస్థితి విషమించింది. ఈ ఫిర్యాదుమీద ఫొగట్‌తోపాటు మరో నలుగురు మహిళా క్రీడాకారులు కూడా సంతకాలు చేశారు. బజరంగ్ పునియా, సాక్షి మలిక్, రవి దయ్యా, దీపక్ పునియా సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. ఈ ఫిర్యాదు తరవాత శుక్రవారం ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ ఫిర్యాదులకు ఏ గతి పడుతోందో పరిశీలిస్తే పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థం అవుతుంది. మహిళా హ్యాండ్‌బాల్ క్రీడాకారిణి 2022 మార్చిలో ఆనందీశ్వర్ పాండే తనమీద అత్యాచారం చేశారని ఫిర్యాదు చేశారు. పాండే 2013 నుంచి 2020 దాకా భారత హ్యాండ్‌బాల్ సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఫిర్యాదుపై ఏ చర్యాలేదు. ఆయన ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారిగా కూడా ఉన్నారు. సాధారణంగా లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరిగాయన్న ఆరోపణలువస్తే వెంటనే ఎఫ్.ఐ.ఆర్. దాఖలుచేస్తారు. నిందితుణ్ని అరెస్టు కూడా చేస్తారు. కానీ మహిళా క్రీడాకారులు ఫిర్యాదుచేస్తే చాలావరకు మధ్యేమార్గం గురించి మాత్రమే ఆలోచిస్తారు తప్ప ఆరోపణ తీవ్రత ఆధారంగా భారత శిక్షాస్మృతిని అమలు చేయనేచేయరు. అందుకే బ్రిజ్‌భూషణ్ శుక్రవారం సాయంత్రందాకా నేను నిందకు గురై రాజీనామా చేసే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. మార్చిలో తన పదవీకాలం అయిపోతే అప్పుడు తప్పుకుంటాననీ ఆ తరవాత ఈ పదవికి పోటీపడను అని చెప్తే ఆయన మొండివైఖరిని ప్రశ్నించే సాహసం చేసిన వారేలేరు. క్రీడాకారుల ధర్నాను ఆయన షాహీన్‌బాగ్ ధర్నాతో పోల్చారు. జంతర్ మంతర్‌లో జరుగుతున్న నిరసన కాంగ్రెస్ ప్రోత్సాహంతో బీజేపీ మీద జరుగుతున్న దాడిగా అభివర్ణించి ఈ ఉదంతానికి కావలసినంత రాజకీయ రంగు పులిమారు.

శుక్రవారం రాత్రి చాలా పొద్దుపోయేదాకా క్రీడాశాఖమంత్రి జరిపిన చర్చల తరవాత బ్రిజ్‌భూషణ్‌సింగ్‌ను రాజీనామా చేయమని కోరారు. క్రీడాకారుల ఆరోపణపై విచారణ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఇవన్నీ వ్యవహారాన్ని సాచి వేయడానికి అనుసరించే విధానాలే. బ్రిజ్ భూషణ్ రాజీనామా చేసినా బాధితులకు దక్కే న్యాయం శూన్యమే. ఎంత మంది ఫిర్యాదుచేసినా ఇంతవరకు ఒక్కరి మీద కూడా చర్య తీసుకున్న ఆనవాలే లేదు. చర్య తీసుకోకపోతే మహిళా క్రీడాకారుల నెత్తిమీద కత్తి వేలాడుతూనే ఉంటుంది. క్రీడారంగంలో ఈ చేదు అనుభవాలు వెన్నాడుతూనే ఉంటాయి. సమాజం వారిని చిన్నచూపే చూస్తుంది. కానీ నిజజీవితంలో రాజకీయ మల్లయోధులను చూస్తే అసలు మల్ల యోధులకు, పతకాలు సాధించిన మల్లయోధులకే ఒణుకు పుడ్తుంది.

క్రీడలతో ఏమాత్రం సంబంధం లేనివారు క్రీడా సంఘాలమీద ఆధిపత్యం చెలాయిస్తూ ఉంటారు. దేశ రాజకీయాలలోనే కనికరం తక్కువ. ఎవరినైనా తమ కుటిల రాజకీయాలద్వారా చిత్తుచేసే సామర్థ్యం మన రాజకీయాలకు ఉంది. సహజంగానే రాజకీయాలలో పురుషాధిక్యత మెండు. క్రీడారాజకీయాలలో కూడా ఈ పురుషాధిక్యత మరింత వికృతంగా, కరకుగా బహిర్గతం అవుతోంది. తమమీద పురుషులు అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు చేసినా ఎన్నాళ్లకు న్యాయం దక్కుతుందో తెలియదు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి అని ప్రశ్నిస్తే సాక్షాత్తు క్రీడాశాఖమంత్రి నిండు పార్లమెంటులో 49 ఫిర్యాదులు వచ్చాయని సెలవిచ్చారు. వీటిలో 19 ఫిర్యాదులను ఇంకా పరిశీలించనే లేదు.

మాంద్యం ముంగిట ప్రపంచం

ఈ సంవత్సరంలో, 2008 ఆర్థిక మాంద్యాన్ని మించిన మాంద్యం ప్రపంచాన్ని చుట్టనుందని ఐక్యరాజ్యసమితి, ఐ.ఎమ్.ఎఫ్ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. దీనిలో భాగంగా ప్రపంచంలో పేరొందిన టెక్ కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగాలు తొలగిస్తున్నాయి. తాజాగా గూగుల్ సంస్థ 12,000 మందికి ఉద్వాసన పలకడంతో యావత్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఇటీవల కాలంలో మెటా, ట్విట్టర్, ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, బైజుస్, అమెజాన్, స్విగ్గీ వంటి సంస్థలు వేలసంఖ్యలో ఉద్యోగస్తులను ఇంటికి పంపుతున్నాయి. ఇప్పటికే అనేకమందిని క్యాంపస్ సెలక్షన్ ద్వారా సెలక్షన్ చేసినా, కాల్ లెటర్స్, నియామక ఉత్తర్వులు ఇవ్వడం లేదు. చాలా మంది నిరాశలోఉంటూ, ఉద్యోగాలకోసం ఎదురు చూస్తున్న పరిస్థితి. 2025 వరకూ ఈ ఆర్థిక సంక్షోభం కొనసాగుతుందని వివిధ అంతర్జాతీయ సంస్థలు అంచనా వేయడం జరిగింది. దీనికి ప్రధాన కారణం కోవిడ్ కాలంలో అన్ని పరిశ్రమలు మూతపడినప్పటికీ, సాఫ్ట్‌వేర్ రంగం మాత్రం అన్ని దేశాల్లో ఊపందుకుంది. అన్ని పనులు ఆన్‌లైన్‌లో జరగడంతో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి. సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు కూడా భారీగా పెరిగాయి.

ఆన్‌లైన్ ద్వారా విద్య, మెడిసిన్, సమావేశాలు, చర్చలు, రకరకాల సేవలు, వ్యాపారాలు భారీఎత్తున జరగడంతో ఉవ్వెత్తున సేవారంగం ఎగిసింది. ఆర్థికమాంద్యం, యుద్ధం కారణంగా సాఫ్టవేర్ రంగంలో ఉద్యోగాలు తీసే పనిలో వివిధ కంపెనీలు నిమగ్నమై ఉన్నాయి. దశల వారిగా ఉద్యోగులను ఇంటికి పంపే పనిలోఉన్నాయి. దీనికి తోడు ద్రవ్యోల్బణం, అధిక ధరలు, బ్యాంక్ వడ్డీరేట్లు, నిర్వహణా భారం పెరుగుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కూడా ఉద్యోగాల కోతకు కారణం అని గుర్తెరగాలి. ఇక రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కూడ సప్లయ్‌చైన్‌కు ఆటకం, ధరలు పెరుగుదలకు కారణం కావడంతో చాలా టెక్ కంపెనీలు, ఖర్చుతగ్గించుకునే క్రమంలో వేలసంఖ్యలో ఉద్యోగులను ఇంటికి సాగనంపుతున్నారు. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా ముప్పై లక్షలు ఉద్యోగాలు గాలిలో కలిసాయి. దీంతో నిరుద్యోగం పెరిగి, కొనుగోలు శక్తి పడిపోతుంది. వస్తుఉత్పత్తి తగ్గి, పారిశ్రామిక రంగం కుదేలైపోతుంది. ఈ విధంగా ఎగుమతులుతగ్గి దాదాపు అన్నీ దేశాలు విదేశీమారకద్రవ్యం కోల్పోయి, ఆర్థికాభివృద్ధి ఋణాత్మక దిశగా పయనించి, అనేక దేశాలు మరెన్నో శ్రీలంకలుగా కళ్ళ ముందు కదలాడే పరిస్థితి దాపరించనుంది.

ఈ ఆర్థిక సంక్షోభం ప్రస్తుతం యూరప్ దేశాల్లో దావానలంలా వ్యాపిస్తోంది. ఈ పరిస్థితి మనకు కూడా ఈ ఏడాది జూన్ తర్వాత నుంచి కనపడుతుంది అని ఆర్థిక నిపుణుల అంచనా. ఇప్పటికే మనదేశంలో స్వాతంత్ర్యం అనంతరం నాలుగుసార్లు 1956,1966, 1973, 1980 సంవత్సరాల్లో వచ్చిన ఆర్థికసంక్షోభంతో దేశ ఆర్థికాభి వృద్ధి మైనస్‌లో నమోదైంది. ప్రస్తుతం రానున్న ఆర్థిక మాంద్యాన్ని తట్టుకో వటానికి ప్రజలు తమవద్ద ఉన్న ధనాన్ని అనవసర, అనుత్పాదక, విలాస వస్తువులపై ఖర్చు చేయరాదని ఆర్థిక నిపుణులుహెచ్చరిస్తున్నారు. ఇప్పటికే మనదేశంలో దాదాపు డెబ్బైఐదు శాతం జనాభా నెలసరి వాయిదాలు(ఈ.ఎమ్.ఐ)లు కట్టడంతోనే తమ జీవితాలు గడుపుతున్నారు. ఒక్కనెల జీతాలు/ పెన్షన్‌లేట్ అయినా, భారిగా పెనాల్టీలు చవి చూస్తున్నారు. ఏదికొన్నా అనగా ఇల్లు, స్థలం, కారు, గృహోపకరణాలు, భూములు చివరికిపిల్లలు ఉన్నత చదువులకు కూడా ఋణాలు తీసుకుని, దాదాపు వారి జీతాలు అంతా అప్పులు కట్టడానికే వెచ్చిస్తున్న పరిస్థితి. ఈ పరిస్థితిలో ఆర్థికమాంద్యంవస్తే, దాదాపు యావత్ భారత్ ప్రజానీకం తీవ్రఒడుదుడుకులు చవిచూసే ప్రమాదంఉంది. ఇప్పటికే దేశంలో సుమారు కొన్ని కోట్లమందికి మూడుపూటల తిండిలేదు. ఆకలి మరణాలు ఉన్నాయి. పోషకాహారంలోపం, రకరకాల అనారోగ్యాలు వెంటాడు తున్నాయి. ద్రవ్యోల్బణం, అధిక ధరలు, నిరుద్యోగం ఆకాశాన్ని అంటు తున్నాయి. ఇక ఆర్థికమాంద్యం వస్తే నూటికి డెబ్బై ఐదుశాతం జనాభా జీవితాలు అస్తవ్యస్తంగా మారనున్నాయి. కావున ఇప్పటినుంచి ప్రభుత్వాలు, ప్రజలు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలి. డబ్బులు భద్రపరుచుకోవాలి. ప్రభుత్వాలు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలపై దృష్టి సారించాలి. ఉత్పత్తి, ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. సేవారంగం, రియల్ ఎస్టేట్, నిర్మాణరంగాలు కంటే వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు మాత్రమే ప్రజలకు, దేశానికి ఆర్థిక, సామాజిక భద్రత కలిగిస్తాయని గ్రహించాలి. ఆర్థిక పరంగా, యుద్ధాలు పరంగా, ఆరోగ్యపరంగా, ప్రకృతిపరంగా ఎన్ని సమస్యలు సంభవించినా ఒకదేశం, ప్రజానీకం భద్రతగా జీవనయానం సాధించాలంటే వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు మాత్రమేనని అందరూ గ్రహించాలి. పొదుపు, అవసరమైన వస్తువుల కొనుగోలు శ్రేయస్కరం. విలాసాలు, అపరిమితమైన ఖర్చులు ఎప్పుడూ ప్రమాదమే. అప్పుడు మాత్రమే ఆర్థికమాంద్యం నుంచి దేశాలు, ప్రజలు గట్టెక్కగలరు.

-ప్రసాదరావు

సంచలనాత్మక బిబిసి డాక్యుమెంటరీ

సత్య

కొన్ని అంశాలను ఎంతగా మూసి పెట్టాలని చూసినా సాధ్యం కాదు. తమకు హానికరం కాదు అనుకున్న అనేక నివేదికలను పశ్చిమ దేశాలు వెల్లడిస్తుంటాయి. వాటిని చూసి మన దేశంలో కూడా అనేక మంది పాత సంగతులను అలాగే ఎందుకు వెల్లడించకూడదు అనుకుంటారు. గోధ్రా రైలు దుర్ఘటన పేరుతో జరిపిన 2002 గుజరాత్ మారణకాండ గురించి బ్రిటన్ రాయబారి తమ ప్రభుత్వానికి పంపిన నివేదికల్లోని అంశాలను బహిర్గతంచేస్తే కొంతమంది ఇప్పుడు ధూం ధాం అంటూ మండిపడుతున్నారు. తమ రాయబారి పంపిన అంశాలను బ్రిటన్ సరికొత్త పద్ధతుల్లో వెల్లడించింది. బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(బిబిసి) రెండవ ఛానల్ "భారత్ : మోదీ వివాదం" (ఇండియా:ద మోదీ క్వొశ్చన్) పేరుతో 2023 జనవరి 17న ప్రసారం చేసిన పరిశోధనాత్మక డాక్యుమెంటరీ తొలి భాగం ఆ దురంతాలను గుర్తుకు తెచ్చి మరోసారి నరేంద్రమోదీ, సంఘపరివార్ సంస్థల పేర్లను జనం నోళ్లలో నానేట్లు చేసింది. బిబిసికి సమాచారం ఇచ్చిన తీరు మీద బ్రిటన్ ప్రభుత్వాన్ని ఖండించలేని నిస్సహాయస్థితికి ప్రపంచంలో ఎదురులేదని చెబుతున్న నరేంద్రమోదీని నెట్టింది. ప్రతిస్పందిస్తే మరింత పరువు పోతుంది అన్నట్లుగా మాట్లాడకూడదని నిర్ణయించింది. పైకి మాట్లాడినా, మాట్లాడకున్నా ప్రపంచమంతా మోదీ గురించి మరోసారి అవలోకిస్తుంది.

ఈ డాక్యుమెంటరీ వక్రీకరణలతో ప్రచారం కోసం నిర్మించిందని, ఒక నిర్దిష్టమైన పరువుతక్కువ కథనాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు రూపొం దించినదని, దానిమీద ఇంతకు మించి స్పందించాల్సింది కాదని విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చీ పేర్కొన్నారు. సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. వివాదం తలెత్తటంతో ఈ డాక్యుమెంటరీని యూట్యూబ్ నుంచి తొలగించారు. ఈ నెల 24న మరొక భాగం ప్రసారం కావాల్సి ఉంది. తమ కథనాన్ని బిబిసి సమర్థించుకుంది. ఉన్నతమైన సంపాదక ప్రమాణాలకు అనుగుణంగా తీవ్రంగా పరిశోధించిన తరువాత రూపొందించినట్లు పేర్కొన్నది. భిన్నగళాలు, అభిప్రాయాలు వెలిబుచ్చేవారిని, నిపుణులను తాము కలిశామని, బీజేపీకి చెందిన వారి స్పందనల సహా భిన్నాభిప్రాయాలకు దానిలో తావిచ్చామని, తమ డాక్యుమెంటరీలో లేవనెత్తిన అంశాలకు తగినసమాధానం ఇవ్వాలని భారత ప్రభుత్వాన్ని కోరగా స్పందించేందుకు తిరస్కరించినట్లు బిబిసి తన ప్రకటనలో పేర్కొన్నది. గుజరాత్ ఉదంతాలు, నరేంద్రమోదీ పాత్ర గురించి ఒక చిత్రాన్ని రూపొం దిస్తున్నట్లు అది ప్రసారంగాక ముందే కేంద్ర ప్రభుత్వానికి తెలుసు అని బిబిసి ప్రకటన చెబుతున్నది. చర్చ మరింత జరిగితే నరేంద్రమోదీ, బిజెపికి మరింత నష్టంగనుక కేంద్రం నుంచి లేదా బిజెపి దీనిగురించి ముందు ముందు

ప్రస్తావించక పోవచ్చు. మొత్తంగా మీడియా నరేంద్రమోదీకి అనుకూలంగా ఉన్నందున పరిమితంగానైనా వార్తలు ఇవ్వకపోవచ్చు, చర్చలు జరపకపోవచ్చు. అంతమాత్రాన రచ్చగాకుండాఉంటుందా, జనం చర్చించకుండా ఉంటారా?

ఏ దేశంలోనైనా పెద్ద ఉదంతాలు జరిగినపుడు ఆ దేశంలో ఉన్న విదేశీ రాయబార కార్యాలయాలు మనదేశం సహా తమ వనరులు, సంబంధాల ద్వారా సమాచారాన్ని సేకరించి వాటిని తమ దేశాలకు చేరవేస్తాయి. వికిలీక్స్ వెల్లడించిన కోట్ల కొద్దీ పత్రాలవే. గుజరాత్ ఉదంతాల గురించి బ్రిటీష్ రాయబార కార్యాలయం అలాంటి నివేదికనే ఇచ్చినట్లు దానిలోని అంశాలను డాక్యుమెంటరీ వెల్లడించింది. బిబిసికి వాటిని అందించారంటే బ్రిటన్ ప్రభుత్వం తొలిసారిగా వాటిని బహిర్గత పరిచినట్లే. అందువలన ఈ డాక్యుమెంటరీ గురించి, దానిలో పేర్కొన్న అంశాల సంగతి ఏమిటని పార్లమెంటులో ప్రతిపక్ష లేబర్ పార్టీ ఎంపీ ప్రస్తావించినపుడు నోరు మూయించేందుకు ప్రధాని రిషి సునాక్ చూశాడు. సమాధానంగా ఏమి చెప్పినప్పటికీ అది మొహమాటంతో చెప్పినవిగానే పరిగణించాలి. నివేదికలోని అంశాలు వాస్తవమా కాదా అని చెప్పకుండా డొంకతిరుగుడు సమాధాన మిచ్చాడు. పాకిస్థాన్ మూలాలున్న ఎంపీ ఇమ్రాన్ హుసేన్ డాక్యుమెంటరీ గురించి ప్రస్తావించగా, దానితో తమకు సంబంధం లేదని, దానిలో భారత ప్రధాని గురించి చిత్రీకరించిన తీరును తాను అంగీకరించటం లేదని రిషి సునాక్ చెప్పాడు.మత విద్వేష హింస ఎక్కడ జరిగినా తాము సహించబోమని, అయితే నరేంద్రమోదీ పాత్రను చిత్రించిన తీరును తాను అంగీకరించనని అన్నాడు. ఇంత రచ్చ జరిగిన తరువాత కూడా బిబిసి చిత్రంలో వెల్లడించిన అంశాల గురించి అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. మరో భాగాన్ని ప్రసారం చేస్తారా లేదా అన్నది చెప్పలేదు. డాక్యుమెంటరీలో పేర్కొన్నదాని ప్రకారం నాటి బ్రిటన్ దౌత్యవేత్త పంపిన సమాచార పత్రానికి పెట్టిన శీర్షిక, సంగ్రహం ఇలా ఉంది. " విషయము: గుజరాత్ మారణకాండ " వెల్లడైనదాని కంటే హింస చాలా ఎక్కువగా ఉంది. కనీసం రెండువేల మంది మరణించారు. పథకం ప్రకారం పెద్ద ఎత్తున ముస్లిం మహిళల మీద అత్యాచారాలు జరిగాయి.లక్షా 38వేల మంది నిరాశ్రయులయ్యారు. హిందువులు ఉండే చోట, హిందువులు-ముస్లింలు కలసి ఉన్న ప్రాంతాలలో ముస్లింల వ్యాపారాలను లక్ష్యంగా చేసుకొని విధ్వంసం కావించారు. పథకం ప్రకారం హింస జరిగింది. కొన్ని నెలల ముందుగానే పథకం వేసి ఉండవచ్చు. రాజకీయ ప్రేరేపితమైనది. హిందువులుండే ప్రాంతాల నుంచి ముస్లింలను తరమివేయటమే లక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వ రక్షణలో దీనికి విహెచ్‌పి (హిందూ ఉగ్రవాద సంస్థ) నాయకత్వం వహించింది. మోదీ ముఖ్యమంత్రిగా ఉండగా ఐకమత్యం అసాధ్యం. వారి(హిందూ మూకలు) పథకం ప్రకారం సాగించిన హింసలో నిర్దిష్ట జాతి నిర్మూలన లక్షణాలన్నీ ఉన్నాయి. శిక్షలేమీ ఉండవనే వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించకుండా విహెచ్‌పి అంత ఎక్కువ నష్టం కలిగించి ఉండేది కాదు. దీనికి నరేంద్రమోదీ నేరుగా బాధ్యుడు."

ఇంతేకాదు, డాక్యుమెంటరీ వెల్లడించిన దాని ప్రకారం బ్రిటన్‌తోపాటు ఐరోపా సమాఖ్య కూడా విచారణ జరిపింది. ఈ రెండు చేసిన దర్యాప్తు సారం ఒక్కటే. హింసాకాండలో మంత్రులు చురుకుగా భాగస్వాములయ్యారు. దాడుల్లో జోక్యం చేసుకోవద్దని సీనియర్ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విశ్వసనీయమైన వారు చెప్పినదాని ప్రకారం 2002 ఫిబ్రవరి 27న నరేంద్రమోదీ సీనియర్ పోలీసు అధికారులతో సమావేశమై జోక్యం చేసుకోవద్దని ఆదేశించారు. అసలు అలాంటి సమావేశం జరగలేదని పోలీసు అధికారి ఒకరు చెప్పినట్లు కూడా బిబిసి తన కథనంలో పేర్కొన్నది. సమావేశం జరిగిందని అంగీకరిస్తే మోదీ ఆదేశాలను అమలు జరిపినట్లుగా అంగీకరించినట్లవుతుంది. ఆ ఉదంతాలకు స్వయంగా కారకులని అంగీకరించినట్లవుతుంది కనుక అసలు సమావేశమే జరగలేదని చెప్పినట్లు కూడా పేర్కొంది. నాడు ఇంటలిజెన్స్ విభాగ అధిపతిగా ఉన్న ఆర్‌బి శ్రీకుమార్, మరో అధికారి సంజీవభట్, మరో అధికారి మాత్రం నరేంద్రమోదీ ఆదేశాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. సదరు సమావేశంలో అసలు వారెవరూ పాల్గొనలేదని అదే కథనంలో మరొక పోలీసు అధికారి చెప్పిన అంశాన్ని కూడా డాక్యుమెంటరీలో పేర్కొన్నారు. మరొక కేసులో సంజీవ భట్ ప్రస్తుతం జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. ఈ కథనంలో లేదా నరేంద్రమోదీ మద్దతుదార్లు, బిజెపి ఏమి చెప్పినా కొన్ని సందేహాలకు సరైన సమాధానం రాలేదు. అంతటి శాంతి భద్రతల సమస్య తలెత్తినపుడు ఏ సిఎం అయినా ఇంటలిజెన్స్ అధికారిని పిలిపించకుండా, ఉన్నతాధికారుల సమావేశం జరపకుండా, నిర్ణయాలు తీసుకోకుండా ఉంటారా ?

మతం వద్దు, గతం వద్దు, మారణహోమం వద్దు

డాక్టర్ దేవరాజు మహారాజు

కఠినమైన, సంక్లిష్టమైన అంశాలతో మెదడు బద్దలు కొట్టుకునే బదులు, చాలా సరళమైన సామాన్యమైన అంశాలమీద దృష్టి పెడితే మనకు చాలా విషయాలు అర్థమవుతాయి. మొట్టమొదట ఒక చిన్న విషయం గమనిద్దాం. ప్రపంచంలో జన జీవనాన్ని అస్తవ్యస్తంచేస్తూ జరుగుతున్న హింసకు కారణాలేవో బేరీజు వేసుకుందాం. జరుగుతున్న హింసలో ఎక్కువ శాతం ధర్మం పేరుతో జరుగుతూ ఉంది. 'ధర్మం' అనే లేబుల్ తగిలించుకుని జరుగుతూ ఉంది. కానీ, అదంతా 'ధర్మస్థాపన' కోసం కాదు. ఉగ్రవాదులైనా, సంప్రదాయవాదులైనా తాము తమ ధర్మాన్ని ప్రతిష్ఠాపించడానికి హింసకు పాల్పడుతున్నామని చెప్పుకుంటున్నారు తప్పిస్తే, ఆ హింస సమాజంలో నైతిక విలువలు, జీవన మూలాలు కాపాడడానికి ఏ విధంగానూ ఉపయోగపడడం లేదు. ఈ విషయాన్ని రుజువు చేయడానికి మనం మన దేశంలోని మూడు ప్రధానమైన మతాలు చెప్పే నైతిక సూత్రాల్ని విశ్లేషించుకుందాం.

హిందూమతం ఏం చెపుతోంది? 'వసుధైక కుటుంబకం' అని చెపుతుంది. ప్రపంచంలోని మనుషులందరూ తమ కుటుంబంలోని వారే అని అర్థం. అలాంటి భావన ఉన్నప్పుడు వీరు ముస్లింలను, క్రైస్తవుల్ని, బౌద్ధుల్ని, జైనుల్ని ఇంకా అన్యమతస్థుల్ని ద్వేషించవచ్చా? ద్వేషించకూడదు కదా? పుష్యమిత్రుడికాలం నుంచి ఇప్పటిదాకా ఎప్పుడైనా అలా జరిగిందా? జరగనప్పుడు ఇక ఆ మతమెందుకూ? ఇక క్రైస్తవుల నైతిక సూత్రం 'లవ్ ద నైబర్" అంటే పొరుగు వాణ్ణి ప్రేమించమని అర్థం. పొరుగువారు ఎవరూ? అంటే నువ్వు ఉండే ఇంటికి నాలుగువైపులా ఉన్న 77 కుటుంబాలు పొరుగువారే అవుతారు. అలా అని వారి మతమే చెపుతోంది. అలా చూసుకుంటూపోతే విస్తృతమైన పరిధిలో ప్రపంచ పౌరులందరూ మన పొరుగువారే. అలా అయినప్పుడు ద్వేషించడానికి, పగతీర్చు కోవడానికి ఎవరూ ఉండరు. ఉండకూడదు కూడా. పొరుగువారు హిందువుల్లో, ముస్లింలో అయితే ద్వేషించవచ్చని అందులో లేదు. పొరుగువారు ఎవరైనా సరే, వారు ఏ ధర్మం, ఏమతం పాటించేవారైనా సరే, ప్రేమించమనే ఉంది. మతాల, కులాల ప్రసక్తి అక్కడ లేనేలేదు. 'పొరుగువారు' అన్నదే అక్కడ ప్రధానం. విశ్వజనీనమైన ఈ భావనకు మన తెలుగుకవి గురజాడ అప్పారావు కూడా స్పందించారు. 'స్వంత లాభము కొంతమానుకుని పొరుగువారికి తోడు పడవోయ్' అని అన్నారు కదా?

ఇక మూడవది ఇస్లాం 'జిస్ వ్యక్తీ కే పడోసి భూకే పేట్ రహతా హై/ ఉస్ కేలియే జన్నత్ క దర్వాజే కభీ నహీ ఖులేంగే' అన్నది ఇస్లాం మత నైతిక సూత్రం. ఇందులో జన్నత్(స్వర్గం) అనే పదం వల్ల ఇది ముస్లింల సూత్రమని స్పష్టంగా తెలుస్తోంది. నీ పొరుగువాడు ఆకలితో నకనకలాడుతూ ఉంటే, నీకోసం స్వర్గ ద్వారాలు ఎలా తెరుచుకుంటాయ్. అనే ప్రశ్న ఉంది. అందులో ఇక్కడ మనం చెప్పుకున్న సూత్రాలు ఒక దానికి ఒకటి వ్యతిరేకం కాదు. ఒకే విషయాన్ని వేరువేరు రకాలుగా చెప్పుకున్నట్లుగా ఉంది. మానవత్వాన్ని పరిరక్షించుకోవడమే మానవుడి ముఖ్య ధ్యేయమని ఈ మూడు మతాలే కాదు, ఇతర అన్ని మతాలూ చెప్పాయి. ఈ భావనలన్నీ మానవతను నిర్వచించడానికి ఉపయోగించిన అత్యున్నతమైన పరిభాషని మనకు అనిపించడం సహజం!

ఇలాంటి పరిస్థితుల్లో ఏ మతానికి సంబంధించినవారైనా, పైన చెప్పుకున్న నైతికసూత్రాలు ఆధారంగా హింసకు పాల్పడరు. హింసకు పూనుకోవడానికి కారణం ధర్మంకాదు. మతం కాదు. ఏ మతమూ ఇతర మతస్థుల్ని కొట్టి చంపమని చెప్పలేదు. మరి ఎందుకు హింసకు/ఉగ్రవాదానికి పాల్పడుతున్నారూ? అంటే తమ అస్థిత్వాన్ని ప్రదర్శించుకోవడానికి! తన ఆధిక్యతను అధర్మంగా స్థాపించు కోవడానికి!! అని చెప్పుకోవల్సి ఉంటుంది. ఇందులో ఎలాంటి ధర్మప్రసక్తీ లేదన్నది వాస్తవం. ఇక్కడ మనకు రెండువిషయాలు కనిపిస్తున్నాయి. 1.మోరాలిటీ(నైతికత) 2.ఐడెంటిటీ(అస్థిత్వం) నైతికతప్రకారం చూస్తే అన్నిమతాల సూత్రాలు ఒకేవిధంగా ఉన్నాయి. కాబట్టి వారు మొరాలిటీ విషయంలో గొడవలు పడడంలేదు. హింసకు దిగడం లేదు. రాజకీయాలు చేయడంలేదు. కానీ, తన అస్థిత్వాన్ని, ఆధిక్యతను నిలుపుకోవడానికి అక్రమమార్గాల్లో హింసకు పాల్పడుతున్నారు.

వివిధ మతాలవారు వివిధ రకాల దుస్తులు ధరిస్తున్నారు. వివిధ మత గ్రంథాలు చదువుతున్నారు. వారి పవిత్ర గ్రంధాలు కూడా వేరువేరుగా ఉన్నాయి. వారు దర్శించే ధార్మికకేంద్రాలు వేరు. వారి పూజాపద్ధతులువేరు. సంప్రదాయాలు, ఆచారాలు వేరు. పుట్టినప్పటి నుండి చనిపోయేదాకా వారు అనుసరించే వేడుకలు, పండగలు, కర్మకాండలు అన్నీ వేరువేరుగా ఉన్నాయి. వీటిలో వేటివల్లా వివిధ మతస్థులమధ్య భేదాభిప్రాయాలు లేవు. ఎవరిపండుగలు వారు జరుపు కుంటున్నారు. ఎవరి జాతరలు వారు జరుపుకుంటున్నారు. ఒక్కోసారి కొందరు ఇతర మతస్థుల వేడుకల్లో, పండగల్లో కూడా స్నేహభావంతో పాలుపంచు కుంటున్నారు. ఈ రకమైన అవగాహనకు ముఖ్యంగా భారతదేశంలో ప్రాముఖ్యం ఉంది. ఈ దేశప్రజల్ని ముస్లింలు పరిపాలించినా, క్రైస్తవులు పరిపాలించినా మత పరమైన ఘర్షణలు మతం ఆధారంగానో, లేక ధర్మం ఆధారంగానో జరుగలేదు. కేవలం అస్థిత్వ స్థాపనకు, తమ 'పై చేయి'ని నిలుపుకోవడానికి చేసినవే! వాటివల్ల సమాజం దెబ్బతిన్నదేగాని, ఎప్పుడూ ఎక్కడా ఏ మంచీ జరగలేదు.

కొన్ని సంఘటనలు ఇక్కడ జ్ఞాపకం చేసుకోవాలి. అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్‌లు గౌతమ బుద్ధుడి ప్రతిమను ధ్వంసం చేశారు. కారణం ఏం చెప్పారంటే ఇస్లాం విగ్రహపూజకు వ్యతిరేకం కాబట్టి ఆ విగ్రహం ధ్వంసం చేశామన్నారు. హిందు దేవాలయాల్లో దేవ దేవతలకు పూజలు చేసినట్లు అఫ్ఘానిస్థాన్‌లోని ఆ పెద్ద బుద్ధుడి విగ్రహానికి నిత్యం అక్కడ ఎవరూ పూజలు చేసేవారు కాదు. అయితే ఏదో దొంగసాకుతో తమ ఆధిక్యతను నిలుపుకోవడానికి, తమను అక్కడ ఎవరూ అడ్డుకోలేరన్న ధీమాతో చేశారు. ప్రతిమల్ని పగల గొట్టమని ఇస్లాం మతం ఎక్కడా చెప్పలేదే? భారతదేశంలో ఒక రాజకీయ నాయకుడు రథయాత్ర పేరుతో దేశమంతా తిరిగాడు. ఆయనే మన్నాడూ? 'నా భగవంతుడైన రాముడు ప్రస్తుతం బాబ్రీమసీదు ఉన్నచోట పుట్టాడు. అది అతని జన్మస్థలం. అక్కడ మందిరం కట్టనంతకాలం రాముడిపై తనకుగల భక్తి పూర్తికాదు"(జబ్‌తక్ వహా మందిర్ నహీ బనావూ తబ్ తక్ మేరా రామ్ బక్తీ పూరా నహీ హెూగా) అని, ఆయనగారు రథయాత్ర సందర్భంగా దేశప్రజల చెవులు పగులగొట్టాడు కదా? తర్వాత కాలంలో బాబ్రీమసీదునే కూల గొట్టాడు. ఇతర మతస్థుల కట్టడాల్ని కూలగొట్టమని ఏ హిందూ పురాణాల్లోనైనా చెప్పారా? ఎక్కడా చెప్పలేదే? ఇక్కడ జరిగింది కూడా అదే! ఒక దొంగ సాకుతో, వక్రబుద్ధితో తమ ఆధిపత్యాన్ని సమాజంలో అక్రమంగా స్థాపించుకోవడానికి చేసిన కుట్ర-దాడి! ఇందులో రహస్యమేమీలేదు.

రాముడి జన్మస్థలం బాబ్రి మసీదు ఉన్నచోటేనని చెప్పడానికి ఖచ్చితమైన ఆధారాలు ఏమీ లేవని-సుప్రీంకోర్టు తన తీర్పులో చెప్పింది. పైగా బాబ్రీ మసీదు అడుగున తవ్వకాల్లో బైటపడ్డవన్నీ హిందూ దేవాలయాలు, ఆనవాళ్లు కావనీ, అవి బౌద్ధారామాల ఆనవాళ్లని అర్కియాలజిస్టులు పరిశీలించి చెప్పారు. మతద్వేషాన్ని ఏ మతమూ పనిగట్టుకుని ప్రచారం చేయలేదు. కుత్సిత బుద్ధితో కొందరు దుండగులు మతం పేరుతో, ధర్మస్థాపనపేరుతో మానవ హననానికి పాల్పడ్డారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలోఉన్న రాజకీయపార్టీ దాన్నే ఇంకా కొనసాగిస్తోంది. దీన్ని దేశ ప్రజలు తప్పకుండా అడ్డుకోవల్సిఉంది. ఒకప్పటి గంగా జమునా తహజీబ్‌ను నిలుపుకోవాల్సి ఉంది.

మతం మాటున దాక్కుని-ఇతర మతస్థుల్ని దొంగ దెబ్బ తీయడం మానాలి! మనుషుల్ని విడగొట్టే మతాలెందుకూ- అనే ప్రశ్న నేటి తరాన్ని తీవ్రంగా వేధిస్తూ ఉంది. కులమతాల్ని వదిలేసి మనుషులు మనుషులుగా హాయిగా హుందాగా బతకొచ్చు కదా? అందుకే దేవులపల్లి కృష్ణశాస్త్రి తన గేయంలో 'మతం వద్దు గతం వద్దు మారణహెూమం వద్దు' అని అన్నారు. అంతేకాదు. 'మతమన్నది నా కంటికి మసకైతే/మతమన్నది నా మనసుకు మబ్బయితే/మతం వద్దు గితం వద్దు మాయా మర్మం వద్దు/ ద్వేషాలు రోషాలు తెచ్చేదే మతమైతే/కలహాలు కక్షలు కలిగించేదే గతమైతే/మతంవద్దు గతంవద్దు మారణహెూమంవద్దు/మతమన్నది లోకానికి హిత మైతే/ హిందువులం ముస్లింలం అందరమూ మానవులం/అందరమూ సోదరులం' అని కూడా నొక్కిచెప్పారు కృష్ణశాస్త్రి, మతాలు-మనుషుల్ని సన్మార్గంలో పెట్టలే నప్పుడు అవి విఫలమైనట్టేకదా అని మనమంటున్నాం. అలాంటప్పుడు వాటిని వదిలేస్తే వచ్చే నష్టం ఏముందనీ?

ఇక్కడ ఇంతియాజ్‌మహ్మద్ అనే నాస్తికుడు చెప్పిన అంశంగూర్చి సీరియస్‌గా ఆలోచించాలి. 'ఒకవేళ 190కోట్ల మంది ముస్లింలు, వారి మసీదుల్లో, 100కోట్ల మంది హిందువులు వారి దేవాలయాల్లో, 250కోట్ల మంది క్రైస్తవులు వారి చర్చిల్లో మూకుమ్మడిగా కేవలం ఒకేఒక్క మనిషి కాన్సర్‌తగ్గాలని ప్రార్థించారని అనుకోండి. ఆ ప్రార్థనలు ఫలిస్తాయా? ఫలించవు కదా! అన్ని కోట్ల మంది తప్పుడు నెంబర్‌కు ఫోన్ చేస్తున్నట్టే కదా? అదే ఎవరో ఒకరు ఆసుపత్రికి ఫోన్‌చేసి, అతణ్ణి తరలించారనుకోండి తప్పకుండా మంచి ఫలితం ఉంటుంది.' ఇదీ వాస్తవం!!

-కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

త్రిపురలో 30 వరకు నామినేషన్లు

ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ

అగర్తల: త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో నామినేషన్ల హడావుడి ప్రారంభమైంది. రాజకీయ పార్టీలు సైతం అభ్యర్థుల ఎంపిక, ప్రచారం తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించాయి. అభ్యర్థుల నామినేషన్ దాఖలుకు చివరి తేదీ జనవరి 30. జనవరి 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి రెండు వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకారం 60 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఫిబ్రవరి 16న పోలింగ్ జరుగుతుంది. మార్చి 2న ఓట్ల లెక్కింపు జరుగుతుందని అదనపు ముఖ్య ఎన్నికల అధికారి సుభాషిశ్ బందోపాధ్యాయ పీటీఐకి తెలిపారు. 28,13,478 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుంటారు. తుది ఓటర్ల జాబితాలో కొత్తగా 65,044 మంది ఓటర్లను చేర్చారు. ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించడానికి మొత్తం 3,328 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తామని బందోపాధ్యాయ చెప్పారు. కేంద్ర బలగాలతో భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. ముగ్గురు ప్రత్యేక పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించింది.

రోగులకు ఎయిమ్స్ ఉచిత రవాణా సదుపాయం

న్యూదిల్లీ: దిల్లీలో ఎయిమ్స్ తన సేవలను మరింత విస్తరిస్తోంది. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లోని కార్డియో న్యూరో సైన్సెస్ సెంటర్‌లో చికిత్స తీసుకున్న రోగులను ఉచితంగా ఇంటి వద్ద దింపడాన్ని ప్రారంభించింది. కార్డియో న్యూరోసైన్సెస్ సెంటర్(సీఎన్‌సీ) వార్డుల నుంచి డిశ్చార్జి అయిన రోగులకు మాత్రమే ఉచిత ప్రయాణ సదుపాయం ఏర్పాటు చేసింది. ప్రైవేట్ వార్డు రోగులకు ఇది వర్తించదని తెలిపింది. ఈ మేరకు ఎయిమ్స్ గతవారమే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేంద్రపాలిత ప్రాంతం దిల్లీ సరిహద్దు లోపల ఎక్కడికైనా చికిత్స పొందిన రోగులను ఉచితంగా ఇంటికి తీసుకెళతామని ఎయిమ్స్ తెలిపింది. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించింది. ఇది అంబులెన్స్ సర్వీసు కాదు. రోగితో పాటు ఒక్కరికి మాత్రమే కలిసి ప్రయాణించే అవకాశం ఉంటుంది.

హిమాచల్‌ప్రదేశ్‌లో 68 'రాజీవ్‌గాంధీ డే బోర్డింగ్ పాఠశాలలు'

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం త్వరలో రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 68 'రాజీవ్‌గాంధీ డే బోర్డింగ్ పాఠశాలలు' నెలకొల్పనున్నట్టు ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుకు శనివారం తెలిపారు. ఈ పాఠశాలల్లో సరికొత్త సాంకేతికత, నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యాశాఖ సీనియర్ అధికారులతో సుకు మాట్లాడుతూ ఈ డే బోర్డింగ్ పాఠశాలలు అన్ని 12.5 ఎకరాల్లో నిర్మిస్తామని, కటింగ్ ఎడ్జ్ సాంకేతికతతో ఉంటాయని వివరించారు. విద్యార్థులను సానుకూలతను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో స్థలాలను అధికారులు ఎంపిక చేయాలని, అలాగే నిర్మాణం కూడా సరైన సమయంలో అయ్యేలా ప్రణాళిక పొందిపరచుకోవాలని సీఎం ఆదేశించారు. అలాగే హిమాచల్ ప్రదేశ్‌లోని జుబ్బల్-కోట్‌కాయ్ అసెంబ్లీ నియోజకవర్గంలో భవిష్యత్‌లో క్రీడా పాఠశాల, కళాశాల, ఇండోర్ స్టేడియం నిర్మించనున్నట్టు సుకు వివరించారు. సిబ్బంది కొరతపై మాట్లాడుతూ ఖాళీలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. హమీర్‌పూర్‌లోని హిమాచల్‌ప్రదేశ్ టెక్నికల్ యూనివర్సిటీలో కొత్తగా వృత్తి విద్యాకోర్సులను మొదలుపెట్టనున్నట్టు సుకు తెలిపారు.

ఆదివాసీల పత్రాల డిజిటలీకరణ చేసిన తొలి జిల్లాగా వయనాడ్

ప్రశంసించిన కాంగ్రెస్ నేత రాహుల్

న్యూదిల్లీ : ఆదివాసీలందరి ప్రాథమిక పత్రాలను డిజిటలీకరణ చేసిన భారతదేశంలోనే తొలి జిల్లాగా అవతరించినందుకు కేరళలోని వయనాడ్‌ను కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ శనివారం అభినందించారు. లోక్‌సభలో వయనాడ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్... 'సాధికారత కలిగిన గిరిజన సంఘం బలమైన భారతదేశానికి మూలస్తంభం' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'ఆదివాసీలందరికీ ప్రాథమిక పత్రాలను అందించడం, డిజిటలీకరణ చేయడంలో వయనాడ్ భారతదేశంలోని 1వ జిల్లా కావడం గర్వంగా ఉంది' అని ఆయన అన్నారు. జిల్లా పాలనా యంత్రాంగం, స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషిని కొనియాడారు.

బలమైన నాయకత్వమే శాస్త్రీయ సామర్థ్యానికి కారణం

భోపాల్: భారత్‌లో ఒకప్పుడు బలహీనమైన నాయకత్వం ఉండేదని, కాని ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ బలమైన నాయకత్వంలో శాస్త్రీయం కూడా మన సత్తా చాటుతున్నామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. స్థానికంగా జరిగిన 8వ ఇండియా ఇంటర్‌నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో చౌహాన్ ప్రసంగించారు. మహమ్మారి సమయంలో భారత్ వాక్సిన్‌లను అభివృద్ధి చేయడమే కాకుండా, 100 దేశాలకు ఎగుమతి చేసిందని, ఇదే దేశంలో బలమైన నాయకత్వానికి నిదర్శనమని ఆయన అన్నారు. 'సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్‌తో అమృత్ కాల్ వైపు కవాతు' అనే థీమ్‌తో 4-రోజులపాటు జరిగే ఈవెంట్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 8వేల మంది ప్రతినిధులు, ప్రముఖ శాస్త్రవేత్తలు సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థల అధికారులు పాల్గొంటారన్నారు. వాక్సిన్‌లు విడుదల చేయకుంటే మనం ఇప్పటికీ ముఖానికి మాస్కులు వేసుకుని కూర్చునేవాళ్లమని చౌహాన్ పేర్కొన్నారు.

తండ్రి మరణాన్ని తట్టుకోలేక బావిలో దూకి మైనర్ ఆత్మహత్య

అశోక్‌నగర్(మధ్యప్రదేశ్): తండ్రి మరణవార్త తెలుసుకున్న 11 ఏళ్ల మైనర్ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని అశోక్‌నగర్ జిల్లాలో చోటుచేసుకున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు. దీనిపై భార్కేడియా గ్రామం నుంచి ఫిర్యాదు అందిందని దెహాత్ పోలీస్‌స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పహల్వాన్ చౌహాన్ తెలిపారు. గుండెనొప్పితో శుక్రవారం ఉదయం మైనర్ తండ్రిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు ద్వారా ఫోన్‌లో విన్న బాలిక, బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో స్థానికులు, కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా, ఆమె మృతదేహం బావిలో కనబడిందని అధికారులు తెలిపారు.

మాస్కో-గోవా విమానానికి బాంబు బెదిరింపు

పనాజీ: మాస్కో నుంచి 240 మంది ప్రయాణికులతో గోవాకు బయల్దేరిన చార్టర్డ్ విమానాన్ని శనివారం తెల్లవారుజామున ఉజ్బెకిస్థాన్‌కు మళ్లించగా, విమానంలో బాంబు ఉందని ఆ రాష్ట్రంలోని దబోలిమ్ విమానాశ్రయ అధికారులకు ఈమెయిల్ వచ్చిందని పోలీసులు తెలిపారు. మాస్కో-గోవా రూట్‌లో రెండు వారాల వ్యవధిలో ఒకే విమానయాన సంస్థకు ఇలా బెదిరింపులు రావడం ఇది రెండోసారి. రష్యా విమానయాన సంస్థ అజూర్ ఎయిర్ నిర్వహిస్తున్న ఈ విమానం తెల్లవారుజామున 4.15 గంటలకు దక్షిణ గోవాలోని దబోలిమ్ విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సి ఉందని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. బాంబు ఉందన్న సమాచారంతో విమానం ఉజ్బెకిస్థాన్‌కు మళ్లించినట్టు వివరించారు. భారత గగనతలంలోకి ప్రవేశించకముందే విమానాన్ని దారి మళ్లించారు. విమానంలో ప్రయాణికులతో పాటు ఏడుగురు సిబ్బంది కూడా ఉన్నారు. జనవరి 9న, మాస్కో నుంచి గోవా వెళ్లే విమానం బాంబు బెదిరింపుతో గుజరాత్‌లోని జామ్‌నగర్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయబడింది. ఆ విమానాన్ని కూడా అజూర్ ఎయిర్‌లైన్సే నడిపింది.

కూల్చివేతలపై ఆప్ ఆందోళన

బీజేపీ ఎంపీ ఇంటి వద్ద నిరసన

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో నిర్వాసితుల కోసం ఆప్ ఆందోళన కొనసాగుతోంది. ప్రత్యేకించి మురికివాడల ప్రజల ఇళ్లు కూల్చివేతకు సంబంధించి అధికారులు నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బాధితుల పక్షాన తాము పోరాడతామని, నిరుపేదల ఇళ్లు కూల్చివేతను అడ్డుకుంటామని ఆప్ స్పష్టంచేస్తోంది. తాజాగా శనివారం తుగ్లకాబాద్ ప్రాంతంలో ఇళ్లు ఖాళీ చేయాలని కోరుతూ స్థానికులకు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ బీజేపీ ఎంపీ రమేశ్ బిధురి ఇంటి ముందు ఆప్ ఎమ్మెల్యేలు, వందలాదిమంది బాధితులు ఆందోళనకు దిగారు. అతిషి, మదన్‌లాల్ సహా ఆప్ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. బీజేపీ సిగ్గుపడాలి, మురికివాడల కూల్చివేతలను నిలిపివేయాలని నినాదాలు చేశారు. జనవరి 26 నాటికి తుగ్లకాబాద్ ఫోర్టు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను తొలగించాలని జనవరి 11న భారత పురావస్తు సర్వే(ఏఎస్ఐ) అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇక్కడి ప్రజలను ఇళ్ల నుంచి బీజేపీ తరిమేస్తోందని అతిషి ఆరోపించారు. బాధితులకు ఇంటి స్థలాలు ఇచ్చేంత వరకు ఖాళీ చేయించవద్దని డిమాండ్ చేశారు. గతంలో బీజేపీ తప్పుడు హామీలు ఇచ్చిందని, ఇప్పుడు కూల్చివేత నోటీసులు పంపిందని ఆమె విమర్శించారు. దిల్లీ ప్రజల పక్షాన తాము పోరాడతామన్నారు. ప్రజలు బాధపడకుండా కాపాడతామని కుల్దీప్ కుమార్ స్పష్టంచేశారు. దిల్లీ ప్రజలు తమకు ఓటేశారని, తాము వారితోనే ఉంటామని అతిషి చెప్పారు.

జమ్ములో వరుస పేలుళ్లు

శ్రీనగర్: జమ్ములో వరుస పేలుళ్లు చోటు చేసుకున్నాయి.. నర్వాల్ పారిశ్రామిక ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ బాంబు పేలుళ్లలో ఏడుగురు గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. అప్రమత్తమైన బలగాలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. ముఖ్యంగా రాహుల్‌గాంధీ జోడో యాత్ర కొనసాగే మార్గాల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అయితే, బాంబు పేలుళ్లకు గల కారణాలు ఇప్పటి వరకు తెలియ రాలేదు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫోరెన్సిక్ నిపుణులు, క్లూస్ బృందాలు ఆధారాలు సేకరిస్తున్నాయి. పేలుళ్లు చోటు చేసుకున్నట్లు ధ్రువీకరించిన జమ్ము అదనపు డీజీపీ ముకేశ్ సింగ్, గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం భారత్ జోడో యాత్ర జమ్ముకు 60 కిలోమీటర్ల దూరంలో చద్వాల్ వద్ద కొనసాగుతోంది. శీతాకాల విరామం అనంతరం శుక్రవారం యాత్రను ప్రారంభించిన రాహుల్ గాంధీ శనివారం బ్రేక్ ఇచ్చారు. తిరిగి ఆదివారం ప్రారంభించనున్నారు. జనవరి 30 నాటికి యాత్ర పూర్తి చేయాలని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. భద్రతా పరమైన కారణాల రీత్యా ఏ మార్గంలో యాత్ర నిర్వహించాలనే నిర్ణయాన్ని కాంగ్రెస్ శ్రేణులు అధికారులకే వదిలేశాయి. దీని కోసం రెండు మూడు రూట్లను ఎంపిక చేసి అధికారులకు ఇచ్చారు.

విద్యాశాఖపై ఎల్‌జీ తప్పుడు ఆరోపణలు

టీచర్లకు అవహేళన: సిసోడియా ఆరోపణ



న్యూదిల్లీ : దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా శనివారం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాపై విరుచుకుపడ్డారు. విద్యా శాఖపై 'తప్పుడు ఆరోపణలు' చేశారని, దేశ రాజధానిలో పని చేస్తున్న ఉపాధ్యాయులను 'ఎగతాళి' చేశారని ఆరోపించారు. శుక్రవారం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎల్‌జీ రాసిన లేఖ రాజకీయ ఉద్దేశంతో కూడుకున్నదని, విద్యా శాఖపై అతని 'తప్పుడు ఆరోపణలు' దిల్లీ విద్యార్థులు, ఉపాధ్యాయులను 'అవమానించడమే' అని సక్సేనాకు రాసిన లేఖలో సిసోడియా పేర్కొన్నారు. 'మా ఉపాధ్యాయుల పనిని అవహేళన చేయవద్దని ఎల్‌జీని కోరుతున్నాను. ఈ శాఖలో అద్భుతాలు చేశారు' అని విద్యా శాఖను కూడా కలిగి ఉన్న సిసోడియా తెలిపారు. శుక్రవారం కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో, నగర విద్యా రంగానికి సంబంధించిన అనేక సమస్యలను లేవనెత్తడం ద్వారా దిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు ఎల్‌జీ ప్రయత్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి సంవత్సరం సగటు హాజరు శాతం పడిపోతోందని, 2012-2013లో 70.73 శాతం ఉండగా 2019-2020 నాటికి 60.65 శాతానికి పడిపోయిందని ఎల్‌జీ పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వలస వస్తున్న విద్యార్థులపై ఆప్ మినహాయింపు వాదనలను కూడా ఆయన ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై సిసోడియా స్పందిస్తూ, దిల్లీ ప్రభుత్వం నిర్వహిస్తున్న పాఠశాలలు 99.6 శాతం ఉత్తీర్ణత సాధించాయని, ఈ పాఠశాలల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు మంచి గ్రేడ్‌లు పొందారని చెప్పారు. లెఫ్టినెంట్ గవర్నర్ హోదాలో ఉన్న వ్యక్తి తప్పుడు లెక్కలు ప్రస్తావిస్తూ లేఖ రాయడం తగదని ఆయన అన్నారు. ఉప ముఖ్యమంత్రి ఎల్‌జీ పేర్కొన్న లెక్కలు అబద్ధమని, తన ప్రకటనతో దేశ రాజధానిలోని మొత్తం విద్యావ్యవస్థ 'పరువు' తీశారని ఆరోపించారు. 'దిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 16 లక్షల నుంచి 15 లక్షలకు తగ్గిందని ఎల్‌జీ ఆరోపించగా, వాస్తవం ఏమిటంటే విద్యార్థుల సంఖ్య 18 లక్షలకు పెరిగింది. మా విద్యా శాఖ కూడా పాఠశాలల మౌలిక సదుపాయాలను మార్చింది. టెన్త్ వేల్ స్కూల్స్ ఇప్పుడు టాలెంట్ వేల్ స్కూల్స్‌గా మారాయి' అని సిసోడియా సక్సేనాకు రాసిన లేఖలో పేర్కొన్నారు. కేంద్రం, వరుసగా వచ్చిన ఎల్‌జీలు అడ్డంకులు పెట్టినా గత ఏడేళ్లలో విద్యాశాఖలో ఆప్ ప్రభుత్వం అన్ని పనులు చేసిందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. 'దిల్లీ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా, దిల్లీ ప్రభుత్వ పనిని అడ్డుకోకుండా సహకరించాలని కోరుతున్నాను. దిల్లీలో శాంతిభద్రతలను కాపాడే బాధ్యతను రాజ్యాంగం మీకు ఇచ్చింది. మా పని చేయడానికి మమ్మల్ని అనుమతించండి. నగరంలో శాంతిభద్రతలను మెరుగుపరచడానికి మీ సమయాన్ని వినియోగించుకోండి' అని తెలిపారు. ఇక సోషల్ మీడియాలో కేజ్రీవాల్ మాట్లాడుతూ, దిల్లీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలిసి నగర విద్యా వ్యవస్థను సంస్కరించడానికి గత ఏడేళ్లుగా కష్టపడ్డారని తెలిపారు. 'విద్యా వ్యవస్థను అవమానించే బదులు, ఎల్‌జీ వారిని ప్రోత్సహించాలి' అని ముఖ్యమంత్రి అన్నారు. కేజ్రీవాల్‌కు ఎల్‌జీ రాసిన లేఖను ప్రస్తావిస్తూ, సక్సేనా ప్రకటన 'అవమానకరమైనది' అని ఆప్ జాతీయ అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ అన్నారు.

'ఎల్‌జీ ప్రకటన అవమానకరమైనది. ఆప్ అధికారంలోకి వచ్చిన తర్వాత దిల్లీ ప్రభుత్వం నడుపుతున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని అతను తన లేఖలో పచ్చి అబద్ధం చెప్పాడు. అయితే 2015లో 14.66 లక్షల నుండి 18కి పెరిగిందన్నది నిజం. 2022లో లక్ష' అని ఆయన అన్నారు. దిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడం ద్వారా పేదల పిల్లలు కూడా చదువులో రాణిస్తున్నారని భరద్వాజ్ పేర్కొన్నారు. దిల్లీలో పేదల పిల్లలు కూడా చదువులో రాణిస్తున్నారని, మన ప్రభుత్వం చేస్తున్న పనిని ఎల్జీ పరువు తీస్తున్నారని, విద్యార్థులు ఉద్యోగ ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు తాము దిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివామని గర్వంగా చెప్పుకుంటున్నారని అన్నారు.

మోదీ, షా వచ్చినా నన్ను ఆపలేరు

సిద్ధరామయ్య సవాల్

మైసూరు: తనకు వ్యతిరేకంగా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రచారం చేసినా తన గెలుపును ఆపలేరని కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య ధీమాగా చెప్పారు. వయస్సు ప్రభావం, దూరాన్ని దృష్టిలో పెట్టుకొని తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని బదామీ నుంచి కోలార్ అసెంబ్లీ నియోజకవర్గానికి మార్చుకోవాలని సిద్ధరామయ్య నిర్ణయించుకున్నారు. 'బీజేపీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోశ్ కావచ్చు...బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మోదీ, అమిత్‌షా...ఎవరైనా కావచ్చు. నాకు వ్యతిరేకంగా ప్రచారం చేసినా కోలార్ నుంచి నా గెలుపును ఎవరూ ఆపలేరు' అని సిద్ధరామయ్య శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో స్పష్టంచేశారు. కోలార్ నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన నాటి నుంచి మీపై వ్యతిరేక ప్రచారం జరుగుతుంది గదా అని విలేకరులు ప్రశ్నించగా ఆయన పైవిధంగా స్పందించారు. 2018లో తాను పోటీ చేసిన బదామీలోనూ ఇదే తరహా ప్రచారం జరిగిందని, అమిత్‌షా, ఇతర బీజేపీ హేమాహేమీలు ప్రచారం చేసినా తాను విజయం సాధించానని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో సిద్ధరామయ్య బదామీ, చాముండేశ్వరీ నియోజకవర్గాల నుంచి పోటీ చేశారు. చాముండేశ్వరి నుంచి ఆయన 36 వేల ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అక్కడ జేడీఎస్ అభ్యర్థి జీటీ దేవెగౌడ గెలుపొందారు. బదామీ నుంచి 1700 స్వల్ప మెజారిటీతో మాత్రమే సిద్ధరామయ్య విజయం సాధించారు. చాలా దూరంగా ఉండటం వల్ల బదామీ నియోజకవర్గం నుంచి తాను ఈసారి పోటీ చేయడం లేదని సిద్ధరామయ్య స్పష్టంచేశారు. 'బదామీ ప్రజలు నన్ను కోరుకుంటున్నారు. ప్రచారం కోసం హెలికాప్టర్ సైతం ఇస్తామన్నారు. అయితే, వయస్సు సంబంధిత సమస్యలు, దూరం కారణంగా పోటీకి సిద్ధంగా లేను. అందుకే కోలార్ నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నా'నని మాజీ సీఎం వివరించారు. కర్ణాటక ప్రభుత్వాన్ని ప్రధాని మోదీ ప్రశంసిస్తున్నారు గదా అని గుర్తు చేయగా మోదీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారుని ఆరోపించారు. ఎస్ఐ నియామక కుంభకోణం సంగతేంటి? అదనపు డీజీపీ అమృత్‌పాల్ జైలులో ఎందుకున్నారు. ఎస్ఐ నియామకాల్లో పెద్దఎత్తున లంచాలు తీసుకున్నారు. ఇది నిజం కాదా అని సిద్ధరామయ్య ప్రశ్నించారు. కరుడు గట్టిన నేరస్తుడు శాంత్రో రవిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడుతోందని విమర్శించారు. ఎన్నో నేరాలకు పాల్పడిన రవిని ఇప్పటి వరకు ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు.

సహకార రంగానికి పవార్ గొప్ప సేవలు

మహారాష్ట్ర సీఎం షిండే ప్రశంసలు

పూనె: ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్‌పై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రశంసలు కురిపించారు. సహకార రంగానికి ఆయన చేసిన సేవలను విస్మరించలేమని చెప్పారు. పూనెలోని వసంతదాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్(వీఎస్ఐ) 46వ వార్షిక సమావేశంలో షిండే శనివారం ప్రసంగించారు. శరద్ పవార్ కూడా వేదికపై ఆశీనులయ్యారు. వీఎస్ఐ చైర్మన్‌గా పవార్ పనిచేస్తున్న విషయం విదితమే. 'రాష్ట్ర, జాతీయస్థాయిలో పవార్ గొప్ప అనుభవం గల నాయకుడు. సహకార రంగానికి ఆయన ఎనలేని సేవలందించారు. దీనిని విస్మరించలేం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాలు, రాష్ట్ర సంక్షేమం కోసం ఎవరు అధికారంలో ఉన్నా పవార్ సూచనలు, సలహాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సూచనలు, సలహాలు ఇవ్వడానికి తనను పవార్ తరచూ ఫోన్‌లో సంప్రదిస్తారని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎన్‌సీపీ, కాంగ్రెస్‌తో శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే చేతులు కలపడాన్ని షిండే, ఆయన మద్దతు ఎమ్మెల్యేలు ప్రశ్నించిన విషయం విదితమే. శివసేనపై షిండే వర్గం తిరుగుబాటుతో ఉద్ధవ్ ప్రభుత్వం కుప్పకూలింది. దేశాభివృద్ధిలో సహకార రంగం కీలక పాత్ర పోషించిందని షిండే చెప్పారు. దీని ప్రాముఖ్యతను గుర్తించి...ఈ రంగానికి ప్రత్యేక మంత్రిత్వశాఖను కేంద్రం ఏర్పాటు చేసిందని తెలిపారు. మహారాష్ట్రలో సహకార రంగానికి పూర్తి మద్దతిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కేవలం లాభనష్టాలకే పరిమితం కాకుండా సంక్షోభ సమయంలోనూ సహకార రంగం తన సామాజిక బాధ్యతను విస్మరించలేదని కొనియాడారు. సహకార రంగం ప్రయోజనాల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పుకొచ్చారు. శరద్ పవార్ ప్రసంగిస్తూ షుగర్ ఫ్యాక్టరీలను పటిష్ఠవంతం చేయడం, ఆర్థికంగా బలోపేతం చేయడానికి చక్కెరతో పాటు ఇతర ఉత్పత్తులను కూడా ఉత్పత్తి చేయాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఇథనాల్ ఉత్పత్తిలో అదనపు షుగర్‌ను ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

భారత్ జీ20 అధ్యక్ష బాధ్యతలు

శాంతి ప్రదర్శనలో అంతర్జాతీయ విద్యార్థులు

న్యూదిల్లీ : బహుపాక్షిక ఫోరమ్ జీ20కి భారతదేశం అధ్యక్షత వహించిన సందర్భంగా శనివారం ఇక్కడ నిర్వహించిన ప్రదర్శనలో జీ20 దేశాలకు చెందిన వారితో సహా అనేక అంతర్జాతీయ విద్యార్థులు పాల్గొన్నారు. త్రివర్ణ పతాకాలు, బెలూన్లను పట్టుకుని, రాజ్‌ఘాట్ సమీపంలోని గాంధీ దర్శన్ నుంచి ఎర్రకోట వద్ద చార్ట్ లాల్ గోయెల్ హెరిటేజ్ పార్క్ వరకు జరిగిన జీ20 'వరల్డ్ పీస్ మార్చ్'లో అనేక మంది పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దాదాపు 120 మంది అంతర్జాతీయ విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. వారికి పూలమాలలు వేసి స్వాగతం పలికారు. విద్యార్థులు రంగురంగుల జెండాలతో పాటు ప్రపంచ శాంతి, ఐక్యత సందేశాలు రాసే ప్లకార్డులు పట్టుకుని కనిపించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత విజయ్ గోయెల్ నిర్వహించారు. ప్రదర్శనలో పాల్గొన్న మారిషస్ నుంచి వచ్చిన ఎస్ఎస్ఆర్ వైద్య కళాశాల విద్యార్థిని ప్రేరణ హర్షం వ్యక్తం చేసింది. 'అద్భుతమైన ప్రదర్శనలో పాల్గొనడం, చూడడం చాలా బాగుంది. నాకు ఎస్ఎస్ఆర్ కళాశాల ద్వారా ఆహ్వానం వచ్చింది. జీ20 ద్వారా చాలా సమస్యలను లేవనెత్తాలని నేను భావిస్తున్నాను' అని ఆమె పీటీఐకి చెప్పారు. అనేక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు పాల్గొన్నారు. రష్యాకు చెందిన జూలియా మాట్లాడుతూ పాత దిల్లీ గుండా నడవడం, భారతీయ సంస్కృతిని అన్వేషించడం తనకు చాలా ఇష్టమని చెప్పారు. 'ఇది అద్భుతంగా ఉంది. మేము పాత దిల్లీ గుండా నడుస్తూ కార్యక్రమాన్ని ఆస్వాదించాము. జీ20కి ఆతిథ్యం ఇవ్వడానికి ఇదే ఉత్తమమైన ప్రదేశం అని నేను భావిస్తున్నాను. మన భారతీయ స్నేహితులు, సహోద్యోగులు చాలా ఉత్సాహంగా ఉన్నారు. ప్రతిరోజూ, వారు పాల్గొనడానికి మరొక కొత్త కార్యక్రమానికి మమ్మల్ని ఆహ్వానిస్తారు. ఆగస్టులో సాంస్కృతిక మంత్రులతో సమావేశాలు, మరిన్ని ఆసక్తికరమైన ద్వైపాక్షిక, బహుపాక్షిక కార్యక్రమాలను మేము ఆశిస్తున్నాము' అని చెప్పారు. మౌంట్ అబూ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 14 మందికి పైగా పిల్లలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా గర్వంగా ఉంది. అందరికీ సమాన విద్యావకాశాల డిమాండ్‌ను జీ20 పెంచాలని నేను కోరుకుంటున్నాను' అని మౌంట్ అబూ టీచర్ సోనియా అన్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ 9, 10 తేదీలలో వార్షిక శిఖరాగ్ర సమావేశంతో ముగుస్తుంది. జీ20 లేదా గ్రూప్ ఆఫ్ 20 అనేది ప్రపంచంలోని ప్రధాన అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల అంతర్ ప్రభుత్వ ఫోరమ్. ఇందులో అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, బ్రిటన్, అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఉన్నాయి.

'ఒక వ్యక్తి ఒక కారు' పిటిషన్ కొట్టివేత

న్యూదిల్లీ: యజమాని రెండో వాహనంపై పర్యావరణ పన్ను విధించాలని డిమాండ్ చేయడంతో పాటు, "ఒక వ్యక్తికి ఒక కారు" నిబంధనను అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు పాలసీ డొమైన్‌కు సంబంధించినవని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'ప్రస్తుత సందర్భంలో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు పాలసీ డొమైన్‌కు సంబంధించినవి. అందువల్ల, మేం పిటిషన్‌ను స్వీకరించడానికి మొగ్గు చూపడం లేదు' అని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ప్రత్యేక శ్రద్ధ, ప్రాధాన్యత, మెరుగైన సమన్వయం కోసం, బడ్జెట్‌ను బాగా ఉపయోగించుకోవడం కోసం వాయు కాలుష్యానికి వ్యతిరేకంగా సమర్థవం తమైన జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రోడ్లపై సునామీ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఒక వ్యక్తికి ఒక వ్యక్తిగత కారును మాత్రమే అనుమతించాలని లేదా పర్యావరణ సెస్ విధించిన తర్వాత మాత్రమే ఎవరైనా రెండో కారును సొంతం చేసుకునేందుకు అనుమతించాలని కూడా విజ్ఞప్తి చేసింది.

వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించొద్దు

అది వివాహ వ్యవస్థను అస్థిరపరుస్తుంది

సుప్రీంకోర్టులో ఎన్‌జీవో పిటిషన్

న్యూదిల్లీ : వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించడాన్ని వ్యతిరేకిస్తూ ఒక స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇది వివాహ వ్యవస్థను అస్థిరపరుస్తుందని పేర్కొంది. వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించడం, భార్య పెద్దవారైతే బలవంతంగా లైంగిక సంపర్కానికి పాల్పడినందుకు విచారణ నుంచి భర్తకు రక్షణ కల్పించే భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) నిబంధనలకు సంబంధించిన పిటిషన్‌ల బ్యాచ్‌లో పురుష్ ఆయోగ్ ట్రస్ట్ దాని అధ్యక్షుడు బర్కా త్రెహాన్ ద్వారా దాఖలు చేసిన పిటిషన్‌లో కోర్టు జోక్యం కోరింది. 'వైవాహిక అత్యాచారం కేసుకు సంబంధించి తగిన ఆధారాలు లేకుండానే వివాహం ముగిసిపోతుంది. బలవంతపు సంభోగానికి సంబంధించిన ఏదైనా రుజువు ఉంటే, భార్య సాక్ష్యం తప్ప మరే ఇతర ప్రాథమిక సాక్ష్యం ఉండదు. ఇది వివాహ వ్యవస్థను సులభంగా అస్థిరపరుస్తుంది' అని అభ్యర్థన పేర్కొంది.

న్యాయవాది వివేక్ నారాయణ్ శర్మ ద్వారా దాఖలు చేసిన పిటిషన్, సంవత్సరాలుగా, మహిళలు చేసిన తప్పుడు ఆరోపణల కారణంగా పురుషులు ఆత్మహత్యలకు పాల్పడిన అనేక సంఘటనలు దేశవ్యాప్తంగా నమోదయ్యాయని పేర్కొంది. 'వివాహితులైన మహిళలు అలాంటి నిబంధనలను దుర్వినియోగం చేసిన లెక్కలేనన్ని కేసులు ఉన్నాయి. ఇటువంటి కేసుల్లో లైంగిక వేధింపులు, 498ఎ, గృహ హింస ఉన్నాయి. ఐపీసీ సెక్షన్ 375లో మినహాయింపు 2 ఉంటే, ఐపీసీ కొట్టివేయబడుతుంది. అది భార్యలు భర్తలను వేధించడానికి, కీలుబొమ్మగా మార్చడానికి ఒక 'సులభ సాధనం' అవుతుంది. ప్రత్యేకించి అత్యాచారం కేసులలో శిక్ష పరిమాణం చాలా ఎక్కువగా ఉంటుంది. రుజువు భారం వారిపై ఉంటుంది. భార్యపై అత్యాచారానికి సంబంధించిన ఏవైనా ఆరోపణలు భార్య మాటపై సత్యంగా పరిగణించబడతాయి. వ్యక్తిగత, వివాహిత సంబంధాల స్వభావం కారణంగా భర్త ఎటువంటి వ్యతిరేక సాక్ష్యాలను నడిపించలేరు' అని పేర్కొంది. కాగా ఈ పిటిషన్ల బ్యాచ్‌పై జనవరి 16న అత్యున్నత న్యాయస్థానం కేంద్రం ప్రతిస్పందనను కోరింది. అయితే కేంద్రం... ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనానికి ఈ సమస్య చట్టపరమైన, సామాజిక చిక్కులను కలిగి ఉందని, పిటిషన్‌లపై ప్రభుత్వం తన ప్రతిస్పందనను దాఖలు చేయాలనుకుంటుందని తెలిపింది. న్యాయవాదులు పూజా ధర్, జైకృతి జడేజాను నోడల్ న్యాయవాదిగా నియమించిన అత్యున్నత న్యాయస్థానం, పిటిషన్‌లను సజావుగా విచారించేందుకు వాద, ప్రతివాదులు మార్చి 3లోగా తమ లిఖితపూర్వక సమర్పణలను దాఖలు చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

అక్టోబర్ విప్లవ స్ఫూర్తి అనుసరణీయం

లెనిన్ వర్ధంతి సభలో రామకృష్ణ, మధు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: దోపిడీ, అసమానతలు, ఆర్థిక సంక్షోభం లేని కష్టజీవుల రాజ్యం కోసం రష్యా అక్టోబర్ విప్లవస్ఫూర్తితో ముందుకు సాగాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. ప్రప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపకులు వ్లాదిమిర్ ఇల్విచ్ లెనిన్ (వీఐ లెనిన్) 99వ వర్ధంతిని పురస్కరించుకుని మార్క్స్, ఏంగిల్స్, లెనిన్ విగ్రహ కమిటీ అధ్వర్యంలో శనివారం విజయవాడలోని లెనిన్ విగ్రహం వద్ద సంస్మరణ సభ జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం జాతీయ కమిటీ సభ్యులు పి.మధు పుష్ప గుచ్ఛాలతో లెనిన్‌కు నివాళి అర్పించారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ కారల్ మార్క్స్ సైద్ధాంతిక సూత్రాలతో దోపిడీ, సామ్రాజ్యవాదశక్తుల నుండి పీడిత, తాడితవర్గాల విముక్తి కోసం సాయుధ పోరాటం నడిపి విజయం సాధించిన ఘనత లెనిన్‌కే దక్కిందన్నారు. నాటో కూటమిని అడ్డుపెట్టుకొని యావత్తు ప్రపంచాన్ని గుప్పెట్లో పెట్టుకోవాలనే అమెరికా ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సోషలిజం, కమ్యూనిజంతోనే శాంతి, ఐక్యత సాధ్యమని రామకృష్ణ ఉద్ఘాటించారు. రష్యాలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో లేకపోయినా...క్యూబా, చైనా, వియత్నాం, బ్రెజిల్, నేపాల్ వంటి దేశాల్లో సోషలిస్టు సమాజం కొనసాగుతోందని చెప్పారు. అలాంటి దేశాలపై అమెరికా ఆంక్షలు విధిస్తూ తన గుప్పెట్లో ఉండేలా బెదిరింపులకు దిగుతోందని విమర్శించారు. బుర్జువా పార్టీలు కార్పొరేట్ శక్తుల సహకారంతో నడుస్తున్నాయని వివరించారు. దేశంలో కమ్యూనిస్టుల సత్తా పెరుగుతోందన్నారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

మధు మాట్లాడుతూ అధికార బీజేపీ ఫాసిస్టు వైఖరి అవలంబిస్తోందని, గిరిజన ప్రాంతాల్లో పర్యావరణానికి హాని కలిగించే విద్యుత్ కేంద్రాల నిర్మాణం ద్వారా వంద గిరిజన గ్రామాలను ముంపుకు గురిచేయబోతుందని మండిపడ్డారు. అంబేద్కర్ ఆశించిన సమ సమాజం రాలేదు గానీ...అయన పేరుతో 125 అడుగులు భారీ విగ్రహం ఏర్పాటు చేస్తూ ఆయన సిద్ధాంతాన్ని భూస్థాపితం చేస్తున్నారని పాలకులపై మండిపడ్డారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం ఉన్న సబ్‌ప్లాన్‌ను కొనసాగించాలని కోరారు. మార్క్సిజం, లెనినిజం ఓ మహత్తర సిద్ధాంతమని చెప్పారు. పార్లమెంటు సాక్షిగా ప్రకటించిన ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న బీజేపీకి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రక్షణ కల్పిస్తున్నదని విమర్శించారు. సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ జనవరి 23వ తేదీన విజయవాడలో జరగనున్న క్యూబా సంఘీభావ సభకు వామపక్షాల నాయకులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ పాలకులు ప్రజల మధ్య మతం, కులం పేరుతో విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఓబులేసు, రాష్ట్ర సమితి సభ్యులు వై.చెంచయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు, వై.వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ. కృష్ణ, ప్రోగ్రెసివ్ ఫోరమ్ రాష్ట్ర నాయకులు చంద్రరావు, నాయకులు తాజారావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ఇస్కఫ్ నాయకుడు మోతుకూరి అరుణకుమార్, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పి.దుర్గాంబ, సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎమ్.సాయికుమార్, అభ్యుదయ, అయ్యప్ప, లంకె సాయికుమార్, నక్కా రాజ్యలక్ష్మి, శాంతి సంఘం నాయకులు మహబూబ్ ఆజం, ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షుడు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్, రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, నాయకులు ఎస్‌కే నజీర్ విప్లవ గేయాలు ఆలపించారు.

లెనిన్ స్ఫూర్తితో పోరాటాలు: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు: సోషలిస్టు రాజ్యస్థాపకులు లెనిన్ స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. లెనిన్ 99వ వర్ధంతి సందర్భంగా గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో లెనిన్ విగ్రహానికి జంగాల అజయ్‌కుమార్, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి శనివారం పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం జంగాల అజయ్ మాట్లాడుతూ ఆర్థిక అసమానతలను అధిగమించడానికి మార్క్సిజం పేరుతో గొప్ప నిర్వచనాన్ని కారల్ మార్క్స్ చెబితే...దానిని ఆవిష్కరించిన మహానేత లెనిన్ అని కొనియాడారు. బుసలు కొడుతున్న సామ్రాజ్యవాదంపై లెనిన్ అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. కమ్యూనిజం, మార్క్సిజం వైపు యువత నడవడానికి లెనిన్ ఆవిష్కరించిన సోషలిస్టు వ్యవస్థే ప్రధాన కారణమన్నారు. నాడు సామ్రాజ్యవాదులు ప్రపంచ ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థలను చిన్నాభిన్నం చేయగా...నేడు అధికారం వెలగబెడుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం వేర్పాటువాదాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఇప్టా జాతీయ అధ్యక్షుడు గని, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు జి.సురేశ్ బాబు, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, సీహెచ్ విజయ్‌కుమార్, చల్లా మరియదాస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, నగర అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు జ్ఞానదీప్, కార్యదర్శి బందారపు శశి, జన సేవాదళ్ నాయకులు నూతలపాటి చిన్న, సీపీఐ నగర సమితి సభ్యులు బాబు, యోగయ్య, సాయి, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డి.రాజా సోదరుడి మృతి

చెన్నై: సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సోదరుడు డి.కన్నదాసన్ (62) కన్నుమూశారు. ఆయన శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. తమిళనాడు, చిత్తతూర్ పంచాయతీ మాజీ అధ్యక్షుడు డి.కన్నదాసన్ తమ నివాసంలో మృతి చెందినట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తమిళనాడు శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. కన్నదాసన్ మృతికి సీపీఐ కార్యదర్శి కె.నారాయణ, పార్టీ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి ఆర్ ముతరాసన్ సంతాపాన్ని ప్రకటించారు. డి.రాజాకు, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కన్నదాసన్ చిత్తతూర్‌లో దురైసామి-నయాగమ్మల్ దంపతులకు జన్మించారు. ఈయనకు డి.రాజాతో సహా నలుగురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. 'కన్నదాసన్ పట్టణాభివృద్ధి కోసం... ప్రజా సంక్షేమం కోసం శ్రమించారు. పంచాయతీ అధ్యక్షుడిగా, రోటరీక్లబ్ అధ్యక్షుడిగా, సహకార బ్యాంకు డైరెక్టర్‌గా వివిధ క్షేత్రాల్లో పనిచేసి ప్రజాదరణ పొందారు' అని సంతాప సందేశంలో ముతరాసన్ పేర్కొన్నారు. కాగా కన్నదాసన్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మతోన్మాదంపై ఉద్యమించాలి

- యువతకు తిరుమలై పిలుపు
- సమగ్ర యువజన విధానం అమలుకు డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మత ఛాందస పోకడలను అనుసరిస్తున్నదని, ఈ విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర పాలకులు సమగ్ర యువజన విధానాన్ని అమలు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో శనివారం హిమాయత్ నగర్ లోని మక్దూం భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని హిందూత్వ అజెండాను దేశంపై రుద్దడానికి కుయక్తులు పన్నుతున్నారన్నారు. కేవలం పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు అనుకూలించే విధానాలనే అవలంబిస్తున్నారు తప్ప దేశ యువతకు అవసరమైన విధానాలను అమలు చేయడం లేదని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో 45లక్షలకు పైగా ఖాళీలు ఉన్నాయని, యువతకు ఉపాధి కల్పించకుండా దేశ ప్రగతి సాధ్యం కాదని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ల ఆస్తులను జాతీయం చేయాలని, తద్వారా దేశ పురోగాభివృద్ధి సాధిస్తుందని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు జరిపిన పోలీసు పరీక్షలలో అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపించాలని, అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తిరుమలై డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, కే ధర్మేంద్ర మాట్లాడుతూ యువత సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలన్నారు. మతోన్మాదాన్ని తుద ముట్టించాలని ఆ బాధ్యతను యువత తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు నెర్లకంటి శ్రీకాంత్, లింగం రవి, మహేందర్, మానస్ కుమార్ పాల్గొన్నారు.

ప్రార్థన స్థలాల్లో ప్రచారం నిషేధం: ఈసీ

న్యూఢిల్లీ: ఈశాన్యంలోని మూడు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలతో పాటు కొన్నిచోట్ల ఉప ఎన్నికలకు నగారా మోగింది. తేదీలను ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. దీంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురించి ఎన్నికల సంఘం తమ సిబ్బందితో పాటు రాజకీయ పార్టీలకు గుర్తుచేసింది. చట్టానికి, మోడల్ కోడ్‌కు కట్టుబడాలని సూచించింది. ప్రార్థనాస్థలాల్లో ఏ రూపేణ ఎన్నికల ప్రచారం నిర్వహించడంపై నిషేధం ఉన్నదని ఈసీ తెలిపింది. ఏ రూపేణ నిబంధనలను అతిక్రమించినా నేరంగా పరిగణిస్తామని, ఐదేళ్ల శిక్ష, జరిమానా విధించే అవకాశముందని హెచ్చరించింది. ఈ మేరకు లేఖను గురువారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు ఈసీ పంపింది. 2012 నాటి మార్గదర్శకాలనూ గుర్తుచేసింది. ప్రస్తుత నిబంధనావళి ప్రకారం ప్రార్థనా స్థలాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించడానికి వీల్లేదని గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నింటికీ తేల్చిచెబుతూ ఈ లేఖ ప్రతులు పంపింది. మత సంస్థల (దుర్వినియోగం నిరోధక) చట్టం, 1988లోని 3,5,6 సెక్షన్ల ప్రకారం మత సంస్థల్లో ప్రచారం నిషేధమని ఈసీ పేర్కొంది కాగా త్రిపుర అసెంబ్లీకి ఫిబ్రవరి 16న, 27న నాగాలాండ్, మేఘాలయలో ఎన్నికలు జరుగుతాయి. ఓట్ల లెక్కింపు మార్చి 2న ఉంటుంది. నాగాలాండ్, మేఘాలయతో పాటు ఒక లోక్‌సభ, ఆరు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు ఫిబ్రవరి 27న జరగనున్నాయి.

రాజమౌళికి జేమ్స్ కామెరూన్ ఆఫర్

హైదరాబాద్: దర్శకధీరుడు రాజమౌళికి హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ అదిరిపోయే ఆఫర్ ఇచ్చారు. 'ఆర్ఆర్ఆర్' చూసి ఫిదా అయిన ఆయన భవిష్యత్తులో ఎప్పుడైనా జక్కన్నకు హాలీవుడ్‌లో సినిమా చేసే ఉద్దేశం ఉంటే తనని సంప్రదించాలని కోరారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను తాజాగా 'ఆర్ఆర్ఆర్' టీమ్ నెటిజన్లతో పంచుకుంది. దీనిపై స్పందించిన నెటిజన్లు భారతీయ సినిమాకు దక్కిన గొప్ప గౌరవం అంటూ కొనియాడుతున్నారు. ఇటీవల అమెరికాలో జరిగిన ఓ కార్యక్రమంలో జేమ్స్ కామెరూన్‌ను రాజమౌళి కలిసిన విషయం తెలిసిందే. 'ఆర్ఆర్ఆర్' గురించి వీరిద్దరూ చాలా సేపు మాట్లాడుకున్నారు. ఈ సినిమా తనకెంతో నచ్చిందంటూ ఇందులోని అనేక సీన్లను కామెరూన్ వివరణాత్మకంగా జక్కన్నకు తెలియజేశారు. ఈ చిత్రాన్ని కామెరూన్ రెండుసార్లు చూసినట్లు ఆయన సతీమణి సుజీ కామెరూన్ వెల్లడించారు. వీరిద్దరి మాటలతో రాజమౌళి అమితానందం పొందారు. ఈ మొత్తం సంభాషణకు సంబంధించిన ఓ స్పెషల్ వీడియోను 'ఆర్ఆర్ఆర్' టీమ్ శనివారం విడుదల చేసింది.

రాజమౌళి: 'టెర్మినేటర్', 'అవతార్', 'టైటానిక్'.. ఇలా మీరు తెరకెక్కించిన అన్ని చిత్రాలను నేను చూశాను. అవి నాలో స్ఫూర్తి నింపాయి. మీ వర్క్ అంటే నాకెంతో ఇష్టం.

కామెరూన్: మీరు తెరకెక్కించిన చిత్రాలు, అందులోని పాత్రలు చూస్తుంటే విభిన్నమైన అనుభూతి కలిగింది. నిప్పు, నీరు, కథ.. ఇలా ఒకదాని తర్వాత మరొకటి మీరు చూపించిన విధానం, బ్యాక్‌గ్రౌండ్ స్టోరీని చెప్పిన తీరు నాకెంతో నచ్చింది. స్నేహం, వైరాన్ని చూపించిన సన్నివేశాలు.. వావ్ అనేలా ఉన్నాయి.

రాజమౌళి: మీ నుంచి వచ్చిన ఈ మాటలు నాకు అవార్డుల కంటే ఎంతో ఎక్కువ. నేను తెరకెక్కించిన చిత్రాన్ని మీరు చూసి, దాన్ని ఇలా విశ్లేషించడాన్ని ఓ మై గాడ్.. నమ్మలేకపోతున్నా.

సుజీ కామెరూన్: 'ఆర్ఆర్ఆర్'ను ఆయన రెండుసార్లు చూశారు. మొదటిసారి ఆయన ఒక్కరే చూశారు. తర్వాత మేమిద్దరం కలిసి చూశాం. సినిమా చూస్తున్నంతసేపు.. ప్రతి సీన్‌ను ఆయనే ముందు చెప్పేశారు.

కామెరూన్: షూట్‌కు ఎంతకాలం పట్టింది.

రాజమౌళి: 320 రోజులు.

కామెరూన్: మీరే కదా ఈ చిత్రానికి సంగీతం అందించింది. మిమ్మల్ని నేను గోల్డెన్ గ్లోబ్స్‌లో చూశాను.

కీరవాణి: థ్యాంక్యూ సర్.

కామెరూన్: సంగీతం ఎంతో బాగుంది. కొన్ని సన్నివేశాలకు నేను లేచి నిల్చొన్నాను. మీరు మరెంతో అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నా.

సిరీస్ మనదే!

- 8వికెట్ల తేడాతో ఘనవిజయం
- అర్ధసెంచరీతో రాణించిన రోహిత్
- కివీస్‌ను బెంబేలెత్తించిన భారత బౌలర్లు

రాయ్‌పూర్: సొంతగడ్డపై టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. ఈ ఏడాది వరుసగా రెండో వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. శనివారం రాయ్‌పూర్ వేదికగా ఏకపక్షంగా సాగిన రెండో వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను టీమిండియా 2-0తో మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. 34.3 ఓవర్లలో 108 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లు మహమ్మద్ షమీ(3/18), హార్దిక్ పాండ్యా(2/16), వాషింగ్టన్ సుందర్(2/7) విజృంభించడంతో న్యూజిలాండ్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. గ్లెన్ ఫిలిప్స్(52 బంతుల్లో 5 ఫోర్లతో 36), మైకేల్ బ్రేస్‌వెల్(30 బంతుల్లో 4 ఫోర్లతో 22) టాప్ స్కోరర్లుగా నిలిచారు.

అనంతరం లక్ష్యఛేదనకు దిగిన టీమిండియా 20.1 ఓవర్లలో 2 వికెట్లకు 111 పరుగులు చేసి సునాయస విజయాన్ని అందుకుంది. రోహిత్ శర్మ(50 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీతో రాణించగా.. శుభ్‌మన్ గిల్(53 బంతుల్లో 6 ఫోర్లతో 40 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. న్యూజిలాండ్ బౌలర్లలో షిప్లే, శాంట్నర్ తలో వికెట్ తీశారు. 108 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ శుభారంభం అందించారు. న్యూజిలాండ్ బ్యాటర్లు తడబడిన పిచ్‌పై స్వేచ్ఛగా ఆడారు. రెండో ఓవర్‌లో బౌండరీతో మొదలుపెట్టిన రోహిత్, ఫెర్గూసన్ వేసిన 5వ ఓవర్‌లో ట్రేడ్ మార్క్ హుక్ షాట్‌తో సిక్సర్ కొట్టాడు. మరోవైపు శుభ్‌మన్ గిల్ ఆచితూచి ఆడినా వీలు చిక్కిన బంతిని బౌండరీకి తరలించాడు. టిక్నర్ వేసిన 10వ ఓవర్‌లో రోహిత్ వరుసగా 4, 6 బాదగా, రోహిత్ కోసం ఓ కుర్రాడు మైదానంలోకి దూసుకొచ్చాడు. దాంతో ఆటకు కాసేపు అంతరాయం కలిగింది. సెక్యూరిటీ ఆ బాలుడిని లాక్కెళ్లగా, రోహిత్ సింగిల్‌తో ఓవర్‌ను ముగించడంతో టీమిండియా పవర్ ప్లేలో వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. ఆ తర్వాత మరో రెండో బౌండరీలు బాదిన రోహిత్.. శాంట్నర్ బౌలింగ్‌లో సింగిల్ తీసి 47 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే రోహిత్ ఇన్నింగ్స్‌కు షిప్లే తెరదించాడు. ఎల్బీగా పెవిలియన్ చేర్చడంతో తొలి వికెట్‌కు నమోదైన 72 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కోహ్లి రెండు బౌండరీలతో జోరు కనబర్చాడు. కానీ మరోసారి శాంట్నర్ బౌలింగ్‌లోనే కోహ్లి (11) వెనుదిరిగాడు. శాంట్నర్ బంతిని అంచనా వేయడంలో విఫలమై స్టంపౌటయ్యాడు. క్రీజులోకి వచ్చిన ఇషాన్ రెండు బౌండరీలు బాదగా, శుభ్‌మన్ విన్నింగ్ షాట్‌తో విజయ లాంఛనాన్ని పూర్తి చేశారు.

త్వరలోనే కాంతార-2

బెంగళూరు: సినీ ప్రియులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తోన్న 'కాంతార' అప్‌డేట్ వచ్చేసింది. 'కాంతార'కు పార్ట్-2 రానున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ వ్యవస్థాపకుడు విజయ్ స్పష్టం చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. 'కాంతార' కొనసాగింపుపై స్పందించారు. 'కాంతార-2'కు మేం ప్రణాళికలు సిద్ధం చేశాం. రిషబ్‌శెట్టి ఇప్పటికే సినిమాకు సంబంధించిన పనులు మొదలుపెట్టారు. జూన్‌లో షూట్ మొదలయ్యే అవకాశం ఉంది. సినిమాలోని కొన్ని సీన్స్ వర్షాకాలం నేపథ్యంలో ఉండనున్నాయి. అందుకే ఆ నెల నుంచి చిత్రీకరణ మొదలు పెట్టాలనుకుంటున్నాం. పాన్ ఇండియా స్థాయిలో వచ్చే ఏడాది వేసవి కానుకగా ఏప్రిల్ లేదా మేలో దీన్ని విడుదల చేయనున్నాం. అయితే ఇది 'కాంతార'కు సీక్వెల్ కాదు ప్రీక్వెల్" అని విజయ్ వివరించారు. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అంతటా మంచి కలెక్షన్స్ రాబట్టింది.

'ఎమర్జెన్సీ'కోసం ఆస్తులన్నీ తనఖా పెట్టా: కంగన

ముంబై: తన తదుపరి చిత్రం 'ఎమర్జెన్సీ' కోసం బాలీవుడ్ నటి కంగనా రనౌత్ తన ఆస్తులన్నీ తనఖా పెట్టారట. ఈ చిత్రం షూటింగ్ పూర్తైన సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఒక నటిగా ఈ రోజు ఎమర్జెన్సీ షూట్ పూర్తిచేశాను. నా జీవితంలోని అద్భుతమైన ఘట్టం చివరిదశకు చేరుకుంది. ఈ సినిమా కోసం ఎలాంటి ఇబ్బందిపడలేదని అంతా భావిస్తున్నారు. కానీ నిజం వేరు. నాకు సంబంధించిన ఆస్తులన్నింటినీ తనఖా పెట్టాను. మొదటి షెడ్యూల్ సమయంలో డెంగీ బారినపడ్డాను. రక్తకణాల సంఖ్య భారీగా పడిపోయినా, నేను ఆ షూట్‌లో పాల్గొనాల్సి వచ్చింది. అది నాకెంతో క్లిష్టంగా మారింది' అంటూ ఆ సినిమా కోసం ఆమె పడిన కష్టాన్ని వెల్లడించారు. అలాగే ఇది తనకు పునర్జన్మ అని వ్యాఖ్యానించారు. స్వతంత్ర భారతదేశంలో చీకటి రోజులుగా పిలిచే ఎమర్జెన్సీ నాటి పరిస్థితుల్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కుతోన్న బాలీవుడ్ చిత్రం 'ఎమర్జెన్సీ' కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దు కుంటోంది. ఇందులో కంగన.. ఇందిరా గాంధీ పాత్రలో కనిపించనున్నారు.

ఆందోళన విరమించిన రెజ్లర్లు

న్యూఢిల్లీ: మహిళా క్రీడాకారులు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ బాధ్యతలకు దూరంగా ఉన్నారు. ఈ మేరకు క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్, ఈ ఆరోపణలపై కమిటీ వేస్తానని హామీ ఇవ్వడంతో రెజ్లర్లు ఆందోళనను విరమించారు.

ఐఓఏ అధ్వర్యంలో కమిటీ

బ్రిజ్ భూషణ్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) స్టార్ బాక్సర్ మేరీకోమ్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ దీనిపై విచారణ జరిపి 10 రోజుల్లోగా నివేదిక ఇవ్వనుంది.

వ్యక్తిగత అజెండాతోనే...

భారత రెజ్లింగ్ సమాఖ్యకు వ్యతిరేకంగా దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు చేపట్టిన ఆందోళనపై డబ్ల్యూఎఫ్ఐ శనివారం స్పందించింది. మహిళా క్రీడాకారులు చేస్తున్న లైంగిక వేధింపుల ఆరోపణలను సమాఖ్య ఖండించింది. వ్యక్తిగత అజెండాతోనే ఆరోపణలు చేస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖకు ఇచ్చిన సమాధానంలో పేర్కొంది. 'భారత రెజ్లింగ్ సమాఖ్యను తన విధి విధానాల ప్రకారం ఎన్నికైన పాలకవర్గం నిర్వహిస్తుంది. ఇందులో అధ్యక్షుడితో సహా ఏ ఒక్కరూ ఏకపక్షంగా వ్యవహరించేందుకు లేదా అధికార దుర్వినియోగానికి పాల్పడేందుకు అవకాశమే లేదు. ప్రస్తుత అధ్యక్షుడి నాయకత్వంలో డబ్ల్యూఎఫ్ఐ రెజ్లర్ల ఉత్తమ ప్రయోజనాల కోసమే పనిచేస్తోంది. జాతీయ, అంతరాజతీయ వేదికల్లో కుస్తీ క్రీడకు సమాఖ్య ఎంతో గుర్తింపు తీసుకొచ్చింది. పారదర్శకమైన, కఠినమైన మేనేజ్‌మెంట్ వల్లే ఇది సాధ్యమైంది. రెజ్లర్లు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదు. వారంతా వ్యక్తిగత అజెండా లేదా ఓ రహస్య అజెండాతోనే ఈ ఆందోళనకు దిగారు. ప్రస్తుత మేనేజ్‌మెంట్ ప్రతిష్టకు భంగం కలిగించేందుకు ఎవరైనా రెజ్లర్లపై ఒత్తిడి తీసుకొచ్చి ఉండొచ్చు' అని డబ్ల్యూఎఫ్ఐ క్రీడల శాఖకు వివరణ ఇచ్చింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.